Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 194 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 11 - 3 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015




## ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను న్యూఢిల్లీలో విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మంగళవారం కలిశారు. న్యూఢిల్లీలో ఉన్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఏపీ భవన్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని ఎంపీ శివనాథ్ అందజేశారు.

## ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల పనితీరు, అందిస్తున్న పౌర సేవలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష









**అమరావతి, (రాజధాని వార్తలు):** విద్యుత్ పంపిణీ సంస్థలు అందిస్తున్న పౌర సేవలు, విద్యుత్ పంపిణీ వ్యవస్థ, పాఠశాల, ఉన్నత విద్య తదితర విభాగాల పనితీరుపై సీఎం చర్చ. రాష్ట్రంలో 14013 మెగావాట్ల మేర విద్యుత్ డిమాండ్ పెరిగినట్టు సీఎంకు వివరించిన విద్యుత్ శాఖ అధికారులు.
విద్యుత్ పంపిణీకి సంబం ధించి పౌరులకు మెరుగ్గా సేవలు అందించటంపై దృష్టి పెట్టాలని ఆదేశించిన ముఖ్యమంత్రి.
ఆర్టీజీఎస్ సమీక్షకు హాజరైన మంత్రి కొలుసు పార్ధసారధి, సీఎస్ సాయి ప్రసాద్, ఐటీ, ప్రణాళిక, మైనింగ్, పాఠశాల, ఉన్నత విద్యాశాఖ అధికారులు. విద్యుత్ సరఫరా, డిమాండ్ అంశాలపై ఆడిట్ నివేదిక ఇవ్వాలని డిస్కమ్ లను ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.

## పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యధిక ప్రాధాన్యత

### - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి యనమదల గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి ఆనం






**చేజర్ల, (రాజధాని వార్తలు):** పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ, వారికి అన్నివిధాల ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం చేజర్ల మండలం యనమదల గ్రామంలో చేజర్ల మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ. 8,53,631 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో తమ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 742 కుటుంబాలకు 6.94 కోట్ల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందించినట్లు చెప్పారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గుడ్ న్యూస్.. 13న రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు



**ఇంటర్నెట్ డెస్క్:** దేశంలోని కోట్లాది మంది అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పీఎం కిసాన్‌కు సంబంధించిన 22వ విడత నిధులు.. ఈ నెల 13న రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. దేశ వ్యాప్తంగా రూ. 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ. 2000 వేల చొప్పున జమ కానున్నాయి. అస్సాం లోని గువాహటి వేదికగా నిర్వహించే కార్యక్రమంలో పీఎం-కిసాన్ నిధులను విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ప్రతి ఏటా మూడు దఫాలుగా రూ. 2 వేల చొప్పున మొత్తం రూ. 6 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ ఏడాది మొత్తం రూ. 19 వేల కోట్ల నిధులు విడుదల చేయనున్నారు. గత ఏడాది నవంబర్ 19వ తేదీన 21వ విడత పీఎం-కిసాన్ నిధులు విడుదల చేశారు. ఈ పథకం ద్వారా దేశంలో పదకొండు కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటి వరకు 21 విడతల్లో రూ. 4 లక్షల కోట్లకు పైగా అన్నదాతలకు ఈ నిధులు అందించబడ్డాయి. కాగా, ఏపీ ప్రభుత్వం ఇదే సమయంలో పీఎం-కిసాన్‌తో కలిపి అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే.

## ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ – విఐటి-ఏపి విశ్వవిద్యాలయం మధ్య “స్మార్ట్ సస్టైనబుల్ క్యాంపస్ ఇనిషియేటివ్”









**అమరావతి, (రాజధాని వార్తలు):** భూమి మరియు పర్యావరణాన్ని రక్షించడానికి దేశవ్యాప్తంగా కొనసాగుతున్న జాతీయ ఇంధన సంరక్షణ ఉద్యమానికి వచ్చిన విశేష స్పందనతో ప్రేరణ పొందిన భారతదేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన విఐటి-ఏపి విశ్వవిద్యాలయం, విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వ ప్రజాసంస్థల సంయుక్త సంస్థగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్‌తో కలిసి కీలక రంగాల్లో ఇంధన సామర్థ్యాన్ని వేగవంతం చేయడానికి సహకరించేందుకు సిద్ధమైంది. 2026 మార్చి 10 నుండి 14 వరకు విఐటి-ఏపి విశ్వవిద్యాలయం అమరావతి క్యాంపస్‌లో నిర్వహిస్తున్న ఎనర్జీ కన్జర్వేషన్ వీక్ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా. పి. అరుళ్మొళివర్మన్ మాట్లాడుతూ, సమాజానికి తక్కువ ఖర్చుతో కూడిన శక్తి పరిష్కారాలను అందించేందుకు ఈఈఎస్ఎల్‌తో కలిసి నూతన శక్తి-సమర్థ సాంకేతికతలను అభివృద్ధి చేయాలని విశ్వవిద్యాలయం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. అదేవిధంగా, విశ్వవిద్యాలయంలో చదువుతున్న సుమారు 20,000 మంది విద్యార్థులను “క్లైమేట్ యాక్షన్ ఛాంపియన్స్”గా తీర్చిదిద్దాలని యూనివర్సిటీ లక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు. దీనివల్ల విద్యార్థులు వాతావరణ మార్పుల సమస్యలను ఎదుర్కొనే దిశగా చురుకుగా పాల్గొని, తమ కార్యక్రమాలను జాతీయ స్థాయిలో ప్రదర్శించగలరని చెప్పారు. అలాగే, ఈఈఎస్ఎల్‌తో కలిసి విఐటి-ఏపి క్యాంపస్‌ను 100 శాతం కార్బన్ ఫ్రీ క్యాంపస్‌గా మార్చడం మరియు తక్కువ ఖర్చుతో కూడిన శక్తి పరిష్కారాలకు ఆదర్శంగా నిలిచే సాంకేతికతలను అభివృద్ధి చేయడం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. జాతీయ కార్యక్రమాల విజయాలను ప్రస్తావిస్తూ, స్ట్రీట్ లైటింగ్ నేషనల్ ప్రోగ్రామ్ అమలు విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన రాష్ట్రాలలో ఒకటిగా నిలిచిందని తెలిపారు. ఈఈఎస్ఎల్ మద్దతుతో విఐటి-ఏపి విశ్వవిద్యాలయం ప్రతిపాదిత ప్రధాన కార్యక్రమాలు:

1. స్మార్ట్ సస్టైనబుల్ క్యాంపస్ అభివృద్ధి:
స్మార్ట్ మీటర్లు, IoT ఆధారిత మానిటరింగ్ వ్యవస్థలు మరియు AI ఆధారిత శక్తి నిర్వహణ సాంకేతికతల ద్వారా విఐటి-ఏపి విశ్వవిద్యాలయం క్యాంపస్‌ను స్మార్ట్ ఎనర్జీ క్యాంపస్‌గా అభివృద్ధి చేయడం.

2. ఇంధన సామర్థ్యం మరియు పునరుత్పాదక శక్తి ప్రాజెక్టులు:
LED లైటింగ్ మార్పులు, సమర్థవంతమైన విద్యుత్ వ్యవస్థలు, రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులు, స్మార్ట్ స్ట్రీట్ లైటింగ్ మరియు వ్యర్థాల నుంచి శక్తి ఉత్పత్తి చేసే బయోగ్యాస్ ప్లాంట్ల అమలు.

3. సంయుక్త పరిశోధన మరియు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్:
స్మార్ట్ గ్రిడ్లు, శక్తి వ్యవస్థల్లో కృత్రిమ మేధస్సు, గ్రీన్ బిల్డింగ్స్ మరియు కార్బన్ మానిటరింగ్ టెక్నాలజీలపై సంయుక్త పరిశోధనలను ప్రోత్సహించేందుకు ఎనర్జీ ఎఫిషియెన్సీ మరియు సస్టైనబిలిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపన.

4. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి:
ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ఎనర్జీ ఆడిట్ ప్రాజెక్టులు, క్యాప్‌స్టోన్ పరిశోధన కార్యక్రమాలు మరియు స్టూడెంట్ క్లైమేట్ ఛాంపియన్ ప్రోగ్రామ్ ద్వారా పరిశ్రమకు సిద్ధమైన సస్టైనబిలిటీ నిపుణులను తయారు చేయడం.

5. జ్ఞాన భాగస్వామ్యం మరియు ప్రదర్శన ప్రాజెక్టులు:
వర్క్‌షాప్‌లు, అతిథి ఉపన్యాసాలు, ఇన్నోవేషన్ హ్యాకథాన్‌లు మరియు EV ఛార్జింగ్ మౌలిక వసతులు, ఎలక్ట్రిక్ క్యాంపస్ రవాణా వంటి స్వచ్ఛ మొబిలిటీ పరిష్కారాలపై ప్రదర్శనలు నిర్వహించడం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏ. చంద్రశేఖర రెడ్డి (ఈఈఎస్ఎల్ నేషనల్ అడ్వైజర్, మీడియా & గవర్నమెంట్ అఫైర్స్) మాట్లాడుతూ, విఐటి-ఏపి విశ్వవిద్యాలయం తీసుకున్న ఈ ముఖ్యమైన నిర్ణయం ఆధునిక సాంకేతికతల వినియోగంతో ఇంధన సామర్థ్యాన్ని విస్తృతంగా పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈఈఎస్ఎల్ సీఈఓ అఖిలేష్ కుమార్ దీక్షిత్ పంపిన ప్రత్యేక సందేశాన్ని కూడా తెలియజేశారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడం దేశానికి చారిత్రాత్మక అవసరంగా మారిందని ఆయన అన్నారు. ప్రపంచంలోని దాదాపు ప్రతి పెద్ద నగరం వాతావరణ మార్పుల ఆర్థిక మరియు పర్యావరణ ప్రభావాల నుంచి తప్పించుకోలేదని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ దృఢ సంకల్పం మరియు ప్రజాహిత విధానాల కారణంగా వాతావరణ మార్పులపై పోరాటంలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.
ఇండియా ఎనర్జీ వీక్ 2026 లో పాల్గొన్న అంతర్జాతీయ నిపుణులు భారతదేశం సాధించిన ముఖ్యమైన శక్తి పొదుపు విజయాలను ప్రశంసించారు:
53.60 మిలియన్ టన్నుల ఆయిల్ సమాన శక్తి పొదుపు. 321.39 బిలియన్ యూనిట్ల విద్యుత్ పొదుపు. 321.06 మిలియన్ టన్నుల CO2 ఉద్గారాల తగ్గింపు. 2015లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన స్ట్రీట్ లైటింగ్ నేషనల్ ప్రోగ్రామ్ మరియు ఉజాలా ప్రోగ్రామ్ వంటి సాంకేతికత ఆధారిత జాతీయ కార్యక్రమాలు దేశంలో శక్తి ఖర్చులను తగ్గించడంతో పాటు భారీ ఆర్థిక లాభాలను మరియు గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషించాయని ఆయన పేర్కొన్నారు. అధునాతన సాంకేతికతలను స్వీకరించడం మరియు విఐటి-ఏపి వంటి ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యంతో దేశం శక్తి సామర్థ్యం, సస్టైనబిలిటీ మరియు ఖర్చు తగ్గింపు లక్ష్యాలలో మరింత ముందడుగు వేయగలదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు శక్తి సామర్థ్య నిపుణులు పాల్గొని, 2028 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అత్యంత శక్తి సమర్థ రాష్ట్రంగా మార్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ దృష్టిని ప్రశంసించారు. ఎనర్జీ కన్జర్వేషన్ వీక్ 2026 కన్వీనర్ డా. వై. వి. పవన్ కుమార్ విఐటి-ఏపి విశ్వవిద్యాలయం మరియు జుజురూ మధ్య ప్రతిపాదిత భాగస్వామ్యంపై వివరమైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి, ఇది స్థిరమైన ఆర్థిక అభివృద్ధికి ఎలా దోహదపడుతుందో వివరించారు. ఈఈఎస్ఎల్ అడ్వైజర్ విఐటి-ఏపి విశ్వవిద్యాలయాన్ని SECM, ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీ మరియు ఉన్నత విద్యా శాఖతో సమన్వయం చేసుకుని విద్యార్థులను ఎనర్జీ కన్జర్వేషన్ ఉద్యమంలో భాగస్వామ్యం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా డా. జయరామన్ కె. అయ్యర్ (మాజీ శాస్త్రవేత్త, ఇస్రో), దాసరి రామకృష్ణ, మంగళగిరి) మరియు హరీష్ జానకి రామన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డా. జగదీశ్ చంద్ర - రిజిస్ట్రార్, డా. ఖదీర్ పాషా - డిప్యూటీ డైరెక్టర్ (స్టూడెంట్ వెల్ఫేర్) తదితరులు కూడా పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించొద్దు

**- ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు తప్పనిసరి చేయాలి - దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు**



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** దేశంలో జరుగుతున్న పరిణామ క్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు తప్పకుండా కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ప్రవేట్ రంగంలో రిజర్వేషన్లు అనే అంశంపై బి.నాగభూషణం అధ్యక్షతన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కరువది సుబ్బారావు మాట్లాడుతూ రోజురోజుకీ అసమానతలు పెరుగుతున్నాయి తప్ప మనుషుల మధ్య సమానత్వం కనుమరుగవుతుందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించిన ప్రకారం సమాజంలో మార్పు రాలేనందువల్ల ప్రభుత్వ సంస్థలన్నీ ప్రవేట్ సంస్థలుగా మారిపోతున్న తరుణంలో దళిత, గిరిజన బడుగు, బలహీన వర్గాల పేదల అభ్యున్నతి జరగాలంటే తప్పనిసరి పరిస్థితులలో ప్రవేట్‌రంగం అన్నది ప్రాధాన్యత పెరుగుతున్న క్రమంలో కింది కులాల అభివృద్ధి కోసం ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించి, పేదల అభ్యున్నతికి పాటు పడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో పేదలు రోజురోజుకీ దయనీయమైన జీవితాన్ని గడుపుతున్నారని, వేలాది మంది దళిత గిరిజనులు చదువు కున్న నిరుద్యోగులు రోడ్ల వెంబడి తిరుగుతూ అనేక రకాల అసాంఘిక కార్యకలాపాలకు ఆకర్షితులవుతున్నారే తప్ప సరైన దారిలో జీవనం సాగించలేకపోతున్నారన్నారు. గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏ విధానాలను అమలు చేసిందో అదే విధానాలను కూటమి ప్రభు త్వం మతోన్మాద భావజాలంతో మనువాద సిద్ధాంతాన్ని ప్రజలపై రుద్దే విధంగా చేస్తున్నదని దుయ్యబట్టారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రవ్యాప్త ఆందోళనలో కొనసాగించే క్రమంలోనే ఏప్రిల్ 19వ తేదీన విజయవాడ నగరంలో జరిగే దళిత కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్ వి యూనివర్సిటీ విశ్రాంతి ప్రిన్సిపల్ డాక్టర్ సవరయ్య మాట్లాడుతూ 78 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో దళితుల బతుకులు దయనీయంగా మారాయన్నారు. అనేక దళిత గ్రామాల్లో కనీసం స్మశానాలు కూడా లేవని, స్మశానాల నిర్మాణం కోసం అంబేద్కర్ భవన్లో నిర్మాణం కోసం విజ్ఞానాలయాలు ఏర్పాటు చేయడం కోసం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఉపయోగించాలన్నారు. కానీ ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లిస్తూ ఎవరి కోసమైతే ఆ నిధులను కేటాయిస్తారో వారికి ఖర్చు చేయకుండా దుబారా చేస్తున్నారని మండిపడ్డారు. చదువుకున్న విద్యార్థులు వేలాది మంది ప్రైవేట్ రంగం వైపు పరుగులు తీసిన అక్కడ కూడా ఉద్యోగాలు లేకుండా నిరసించి పోతున్నారని, దీనంతటికీ ప్రధాన కారణం పాలకుల వైఫల్యమైనని అన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలియజేయడానికి దళిత హక్కుల పోరాట సమితి నాయకత్వం పెద్ద ఎత్తున పోరాటాలు చేయడం అభినందనీయమన్నారు. అందుకోసం దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల పేదలు ఐక్యంగా పోరాటాలు చేయాలని ఆయన సూచించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ దళితులపై నేటికీ రకరకాలుగా వివక్షతకు గురి చేస్తూ వారిపై దాడులు చేస్తూ మానసికంగా హింసిస్తున్నారని, దీనిపై పోలీసులుగా ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తూ దళితులకు తీరని అన్యాయమే చేస్తున్నారే తప్ప దళితులకు ఏ పోలీస్ స్టేషన్లో కూడా న్యాయం జరగడం లేదని అన్నారు. అందుకు గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన తగాదాలను కొన్ని ఉదాహరణగా చూపెట్టారు. దళిత హక్కుల పోరాట సమితి చేస్తున్న పోరాటాలకు సిపిఐ తమ వంతు అన్ని రకాల సహాయ సహకారాలు అందించి, ఉద్యమం బలపరచడానికి కావలసిన సూచనలు చేశారు. ఈ సదస్సులో జై భీమ్ ఆర్మీ వ్యవ స్థాపక అధ్యక్షులు పులి శ్రీకాంత్, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు బి.నాగభూషణం, చిన్నం కాళయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జే. తులసి రాజన్, సహాయ కార్యదర్శి మించిల్ శివకుమార్, పి.బాల కృష్ణయ్య, ఆర్.బలరాం నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షురాలు సి.చారులత తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సరఫరాకు అంతరాయం : కమిషనర్ ఎన్. మౌర్య



**తిరుపతి, (రాజధాని వార్తలు):** నగరంలో తెలుగుగంగ నీటి సరఫరా పైప్ లైన్ మరమ్మతులు చేయనున్న కారణంగా ఈ నెల 11వ తేదీ త్రాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరానికి నీటి సరఫరా చేయు తెలుగు గంగ హెడ్ వాటర్ వర్క్స్ మెయింటెనెన్సు చేయుటలో భాగంగా లీలా మహాల్ పంపింగ్ స్టేషన్ నుండి పళణి ఈ.యల్.యస్.ఆర్ వరకు ఉన్న 600 యం.యం.డయా పంపింగ్ మెయిన్ పైపు లైను, లీలా మహాల్ రోడ్డులోని సి.యస్ సినిమాస్ (ఓల్డ్ దేవేంద్ర థియేటర్) దగ్గర డ్యామేజీ అయి త్రాగునీరు వృథాగా పోతున్నదని గుర్తించామని తెలిపారు. ఈ డ్యామేజ్ అయిన పైపులైన్లు మార్పించుటకు, మరియు మరమ్మతులు పనిని చేపట్టుచున్నందున తిరుపతి నగర ప్రజలకు మార్చి 11వ తేదీ త్రాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుందని తెలిపారు. ఈ మరమ్మత్తుల వలన రాయల్ నగర్, గోపాలరాజ్ కాలనీ, భైరాగి పట్టెడ, హాథిరంజి కాలనీ, యస్.బి.ఐ కాలనీ, భగత్ సింగ్ కాలనీ, యస్,టి.వి నగర్, కేసవాయనగుంట, రాఘవేంద్ర నగర్, పల్లివీది, బలిజవీది, పూలవీది, మర్రిమాను వీధి, చిన్నకాపు వీధి, బండ్లవీది, సున్నపు వీది, జి.యస్. మాడ వీధులకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఈ మరమ్మతులకు ప్రజలు సహకరించాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆ ప్రకటనలో తెలిపారు.

# అరకు కాఫీ షాప్ సీజ్

**- రైల్వే స్టేషన్ జీవియంసి ఓల్డ్ బస్ స్టాప్‌లో ఏర్పాటు చేసిన అరకు కాఫీ షాపును సీజ్ చేస్తున్న రైల్వే, ఆర్పీఎఫ్ అధికారులు - నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతకు ప్రయత్నాలు - ప్రారంభించిన తర్వాత రైల్వే అధికారులు చర్యలు - జీవీఎంసీ రైల్వే నిర్ణయం మేరకు దుకాణం తెరుస్తాం.. లీజు దారు రోహిణి**







**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ రైల్వే స్టేషన్ బయట గత కొన్ని సంవత్సరాలుగా నిరూపయోగంగా, ఆ సాంఘిక కార్యకలా పాలు నిలయంగా మారిన జీవియంసి పాత బస్ స్టాపును, జీవి యంసి అరకు స్టాల్, సహాజ ఉత్పత్తుల కోసం, ఐదు నెలల క్రితమే బి రోహిణి అనే ఆమెకు కేటాయించారు. ఐదు నెలలుగా వారి ఆధీనంలోనే ఉంది. దానికి విద్యుత్ కనక్షన్ వేయడంతో పాటుగా, పూర్తి మెరుగులు దిద్దారు.షటర్లు, పెయింట్లు వేయించి, యథా ప్రకారం అద్దెచెల్లిస్తున్నారు. దానిని ప్రారంభించిన తరువాత రైల్వే ఇంజనీరింగ్ సిబ్బంది, ఆర్పీఎఫ్ తో వచ్చి ఏలాంటి నోటీ సులు, సమాచారం ఇవ్వకుండా ఈ స్థలం మాదంటూ, అందు లో ఉన్న మొత్తం మెటీరియల్‌తో సహా షాపును నిర్వాహకురాలు రోహిణి సమక్షంలోనే సీజ్ చేశారు. దీనిపైన రైల్వే, జీవియంసి ఉన్నత అధికారులు ఒక నిర్ణయం తీసుకున్న తరువాత తెరు స్తామని రోహిణి చెప్పారు.

# ఇక ప్రజల్లోకి వెళ్దాం...!

**- కూటమి అరాచకాలను ఎండగట్టాలి - రెండు రోజులుగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయండి - దక్షిణ సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జగన్మోహన్ రెడ్డి కన్నా మించి పథకాలు ఇస్తామని అమాయక ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ అరాచకాలను ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపునిచ్చారు. వైసిపి అధిష్టానం ఆదేశాల మేరకు రెండు రోజులోగా క్యాడర్ రిజిస్ట్రేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని దక్షిణ వైసీపీ శ్రేణులకు ఆదేశించారు. ఆసీలమెట్ట కార్యాలయంలో సోమవారం ఉదయం దక్షిణ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో వైసీపీ విజయ దంకా మోగించాలన్నారు. క్యాడర్ రిజిస్ట్రేషన్ 100% పూర్తిచేసి డిజిటలైజేషన్ చేయాలన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపు లభించే విధంగా ఐడి కార్డులు అందజేసి పార్టీ అభివృద్ధికి కష్టపడే ప్రతి ఒక్కరికి ఎటువంటి సిఫార్సులు లేకుండా సముచిత స్థానం కల్పించడానికి అధిష్టానం సిద్ధంగా ఉందన్నారు. పార్టీకి కార్యకర్తలే రథసారధులని, జగన్మోహన్ రెడ్డిను మళ్లీ ముఖ్యమంత్రిగా చూసేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలని చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ తుంగలో తొక్కారన్నారు. అన్ని వర్గాల ప్రజలతోపాటు జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధికి తూట్లు పొడిచారన్నారు. విద్య వైద్యాన్ని పూర్తిగా అటకెక్కించారని వాసుపల్లి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే విధంగా పార్టీ క్యాడర్ను బలోపేతం చేయాలని వాసుపల్లి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ కార్పొరేటర్లు వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 21, 22న రైతు సంఘం మహా సభలు : హేమలత



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి వేదికగా ఈ నెల 21, 22 తేదీల్లో జరగబోయే ఏపీ రైతు సంఘం జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో సోమవారం రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. హేమలత మాట్లాడుతూ..జిల్లాలో రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటోందని తెలిపారు. వరి అధికంగా పండే తూర్పు మండలాల్లో గిట్టుబాటు ధర లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దళారీలే ధరలు నిర్ణయిస్తున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదని మండిపడ్డారు. ఉన్నా అవి మిల్లర్లకు దళారీగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాల కారణంగా సూళ్ళూరు పేట మండలంలో 350 ఎకరాల్లో రైతులు పంట నష్టపోతే ప్రభుత్వం కనీసం పరిహారం అందించలేదని ఆవేదన వ్యక్తపరిచారు. ఇంకా పరిష్కారం కాని రైతాంగ సమస్యలు ఎన్నో ఉన్నాయనీ, వాటిన్నంటినీ మహ సభల్లో చర్చించి ఉద్యమ ప్రణాళికను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య, రంగయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేయండి

**- జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి - ప్రాజెక్టుల భూసేకరణపై కలెక్టర్ సమీక్ష**

**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో కొనసాగుతున్న కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రైల్వే లైన్లు మరియు జాతీయ రహదారుల భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి శనివారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించిన కలెక్టర్, నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి ఇప్పటికే 2712.51 ఎకరాల సేకరణ పూర్తయిందని, ఇతర పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తోటపల్లి, తారకరామ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులపై సమీక్షించారు. తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టు విషయంలో మిగిలి ఉన్న 204.53 ఎకరాల భూసేకరణను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, సాగునీటి పనులకు ఎటువంటి ఆటంకం కలగకూడదని స్పష్టం చేశారు. రైల్వే ప్రాజెక్టుల పురోగతిని వివరిస్తూ, విజయనగరం – సంబల్‌పూర్ మూడవ లైన్ పనులకు సంబంధించి వారం రోజుల్లోగా విత్ డ్రావల్ ప్రపోజల్స్ సమర్పించాలని ఆర్డీవోను ఆదేశించారు. కొత్తవలస – విజయనగరం నాలుగో లైన్ మరియు ఖుర్దా రోడ్ – విజయనగరం మూడవ లైన్ పనులకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్లు, స్ట్రక్చర్ వ్యాల్యూయేషన్ రిపోర్టులు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దే శం చేశారు.

జాతీయ రహదారులైన ఎన్ .హెచ్.–516 బి (పెందుర్తి – బొబ్బిలి) మరియు ఎన్హెచ్–130 సిడి (రాయ్‌పూర్ – విశాఖపట్నం) పనులలో ఎదురవుతున్న వివాదాలను త్వరితగతిన పరిష్కరించి, భూసేకరణ అవార్డులు జారీ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే జిల్లాలో మంజూరైన 17 రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల స్థితిగ తులను సమీక్షిస్తూ, గెజిట్ నోటిఫికేషన్ ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టులన్నీ సకాలంలో పూర్తయ్యేలా రెవెన్యూ మరియు రైల్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఈ సమావేశంలో ఆదేశించారు. మున్సిపాల్టీల్లో మురుగునీటి సమస్యకు పరిష్కారం కోసం ప్రతిపాదించిన ఎస్టీపీలకి, పరిశ్రమల విస్తరణకు, కొత్తగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమలు, హోటళ్ళు, బాడంగి నావెల్ డిపో, రెల్లి గ్రేహౌండ్స్, పతంజలి, ఫుడ్ పార్కులు, ఐటీ పార్కులు, ప్రతిపాదిత గుర్ల స్టీల్ ప్లాంట్, ఎంఎస్‌ఎంఈ పార్కులు తదితర వాటికి భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ సేధు మాధవన్, డిఆర్వో సిహెచ్ సత్తిబాబు, ఎస్డీసిలు కళావతి, శ్రీరాములనాయుడు, ఆర్డీవోలు వెంకటేశ్వరరావు, సుధారాణి, మోహనరావు, వివిధ శాఖల ప్రతినిధులు, తహసీల్దార్లు, ఎల్‌ఏ యూనిట్ల డిటిలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన మహిళలకు పురస్కారం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖలో శ్రీనివా సుని కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. అన్న మయ్య 12వ తరం తాళ్ళపాక స్వామీజీ చేతుల మీదుగా అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని తిరుకళ్యాణోత్సవం విశాఖ లోని గురజాడ కళాక్షేత్రంలో కన్నుల పండుగగా జరిగింది. భక్తుల గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక శోభ వెల్లువిరిసిశీది. తాళ్ళపాక స్వామీజీ స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి కన్యాదా నం చేశారు. శ్రీనివాసుని కల్యాణానికి విచ్చేసిన సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ను తాళ్ళపాక స్వామీ సత్కరించి ఆశీర్వదించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన మహిళలకు పురస్కారాలను అందజేశారు. ముఖ్యంగా అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ పూజారి శైలజను మరియు సుమన్ టీవీ రీజనల్ కో–ఆర్డినేటర్ వరలక్ష్మిని స్వామీజీ ప్రత్యేకంగా సత్కరించి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తాళ్ళపాక స్వామీజీ మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణించాలని ఆకాంక్షించారు. పూజారి శైలజ వంటి క్రీడాకారిణులు దేశానికి గర్వకారణమని, అలాగే మీడియా రంగంలో వరలక్ష్మి అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. సనాతన ధర్మ పరిరక్షణలో మరియు కుటుంబ వ్యవస్థలో మహిళలు పోషిస్తున్న పాత్ర వెలకట్టలేనిదని తాళ్ళపాక స్వామీజీ పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా అన్నమయ్య సంకీర్తనలు, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, సంప్రదాయ మహిళా పోటీలు, కోలాటం, తంబోలా మరియు లక్కీ డిప్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉషశ్రీ, ట్రస్ట్ ప్రతినిధి సునీత పలువురు ప్రముఖులు, అన్నమయ్య ఆహ్వాన కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## యుద్ధం ఇస్తున్న అతిచక్కని అవకాశం!

చరిత్రను గుర్తుంచుకోవటం కష్టం. మరిచిపోవటం సులభం. మంచి పనులు చేసినవాళ్లే దాన్ని గుర్తుచేస్తూ భవిష్యత్తు తరాలకు ప్రేరణగా ఉంటారు. తప్పని కచ్చితంగా తెలిసి దారుణాలకూ దురాగతాలకూ దౌర్జన్యాలకూ పాల్పడినవారు చరిత్రను తేలికగా మర్చిపోతారు. ప్రజలు దాన్ని మర్చిపోయేలానూ చేస్తారు. వ్యక్తులకైనా దేశాలకైనా ఇదే వర్తిస్తుంది. ఇరాన్‌పై బాంబులు కురిపిస్తూ, రోజుకో విధంగా యుద్ధ కారణాలను వినిపిస్తోన్న అమెరికాకు అసలు ఉన్న చరిత్రే తక్కువ. అందులోనూ మరుపు చాలా ఎక్కువ. ఎలాంటి యుద్ధ ప్రకటన లేకుండా, ఐక్యరాజ్యసమితిలో సమస్యను చర్చించకుండా, వేలాది ప్రాణాల ఉసురుపోసుకుంటూ, ఉన్మత్తతతో ఊగిపోతున్న అమెరికా అధ్యక్షుడు.. తన చర్యల వల్ల చరిత్రలో ఒక గొప్ప అవకాశం వచ్చిందనీ దాన్ని ఇరాన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. అసలు ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం రావటానికీ, ఆ తర్వాత అది తన పదఘట్టనల కింద ప్రజాస్వామ్యాన్ని నలిపివేయడంలోనూ అమెరికా పాత్రే కీలకం. ఆ చేదు చరిత్ర ట్రంప్‌లాంటి అమెరికా పాలకులకు ఇప్పుడు గుర్తుకు రావటంలేదు. గుర్తుచేసిన వాళ్లను జాతి వ్యతిరేకులుగా ముద్రలు వేస్తున్నారు. పశ్చిమాసియా దేశాలను వాటి మానాన వాటిని వదిలివేస్తే అవన్నీ నిజమైన ప్రజాస్వామ్యం దిశగా కొన్ని అడుగులైనా తప్పనిసరిగా వేసేవి. కానీ చమురు సంపదలపై గుత్తాధిపత్యాన్ని నెలకొల్పుకొనే లక్ష్యంతో ప్రజాబలంతో అక్కడ ప్రభుత్వాలు ఏర్పడకుండా ముందుగా బ్రిటన్, ఆ తర్వాత అమెరికా శక్తివంచన లేకుండా పని చేశాయి. అందుకే అమెరికా ప్రాపకంలోని పశ్చిమాసియాలో ప్రజాస్వామిక ప్రభుత్వాలూ లేవు. బహుళపార్టీలు కలిగిన రాజకీయ వ్యవస్థలూ లేవు. లౌకికవాదం ఉన్న చోట భిన్నాభిప్రాయాలకు తావు ఉంటుంది. అవి ఉన్న చోట ప్రజాస్వామ్య రాజకీయాలు ఉంటాయి. పశ్చిమాసియాలో అలాంటివి బలపడకుండా ఉండటానికి మతశక్తులకూ రాజరికాలకూ అమెరికా వెన్నుదన్నుగా నిలిచింది. ప్రజాస్వామ్యశక్తులు ఏదోవిధంగా బలపడిన చోట వాటిని నిర్వీర్యం చేసే దాకా నిద్రపోలేదు. బహుళ పక్ష రాజకీయాలు ఉంటే ఆర్థిక విధానాల మంచి చెడులపై విశ్లేషణలు వస్తాయి. విదేశీ కంపెనీలు తరలించే సొమ్ముల లెక్కలు తేలుతాయి. ఈ బెడద లేకుండా ఉండాలంటే అక్కడి దేశాలను నయానో భయానో ప్రజాస్వామ్యానికి దూరంగా ఉంచాలి. 20వ శతాబ్దంలోనూ రాజరికాలనూ, నియంతృత్వాలనూ చలాయించాలని చూసే స్థానిక పాలకులకూ ఆ ధోరణి నచ్చింది. చమురు సంపదపై ఆధిపత్యం కోసం ఇరాన్‌లో ప్రజాస్వామ్యాన్ని బలిపెట్టటానికి అమెరికా ఏమాత్రం వెనుకాడలేదు. రాజరికపు అధికారాలకు కత్తెర వేయాలనే డిమాండుతో ఇరాన్ ప్రజలు 1906లోనే ఉద్యమించారు. టెహరాన్ వీధులను ఆందోళనలతో హోరెత్తించారు. ప్రజల ఒత్తిడితో ఆనాటి రాజు షా మొజాఫర్ అద్‌దిన్‌కు నేషనల్ అసెంబ్లీని (పార్లమెంట్) ఏర్పాటుచేయక తప్పలేదు. కొత్త రాజ్యాంగమూ రూపొందింది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందూ ఆ తర్వాతా ఏర్పడిన అల్లకల్లోల పరిస్థితుల్లో 1921లో రెజాఖాన్ పహ్లవీ అధికారాన్ని చేపట్టి రాజుగా (షా) ప్రకటించుకున్నాడు. అప్పటికి 20 ఏళ్ల ముందే బ్రిటన్‌కు చెందిన వ్యాపారవేత్తకు ఇరాన్‌లో చమురు అన్వేషణపై గుత్తాధిపత్యాన్ని కట్టబెట్టారు. భారీగా ఉన్న చమురు నిల్వలను వెలికితీసి అమ్మటానికి ఆంగ్లో?ఇరానియన్ కంపెనీ ఏర్పడింది. పేరులో ఇరానీ ఉన్నా లాభాల్లో ఇరాన్ ప్రభుత్వానికి దక్కేది చాలా తక్కువ. అందుకే చమురు సంపదపై గుత్తాధిపత్యంతో విపరీత లాభాలను ఆర్జిస్తున్న ఆంగ్లో?ఇరానీ కంపెనీని జాతీయం చేయాలని ప్రజలందరూ కోరుకున్నారు. ఆ ప్రజాకాంక్షకు ప్రతీకగా నిలిచిన వారిలో నేషనల్ ఫ్రంట్‌కు నాయకుడైన ముహమ్మద్ మొసాద్దేగ్ ప్రముఖుడు. ప్రపంచబ్యాంకు అంటేనే అమెరికాకు అనుకూలం. అట్లాంటి ఆ బ్యాంకు ఇచ్చిన లెక్కలే చమురు దోపిడీని బట్టబయలు చేశాయి. 1914-1951 మధ్య 3.64 బిలియన్ డాలర్ల లాభాన్ని ఆంగ్లో-ఇరానియన్ కంపెనీ పొందింది. ఇరాన్ ప్రభుత్వానికి వచ్చింది 50 మిలియన్ డాలర్లు మాత్రమే. వనరులున్న దేశానికి కంటే మూడురెట్లు (1.5 బిలియన్ డాలర్లు) బ్రిటన్‌కు పన్నుల రూపంలో దక్కింది. చమురుపై గుత్తాధిపత్యాన్ని తొలగించటం ఆనాటి రాజకీయాలకు కేంద్ర బిందువైంది. మొసాద్దేగ్‌ను ప్రధానిని చేయాలని పార్లమెంట్ రెజాషాపై ఒత్తిడి తెచ్చింది. గత్యంతరంలేక దానికి ఆమోదం తెలిపారు. చమురును జాతీయం చేయాలని పార్లమెంట్ ఏకగ్రీవంగా తీర్మానించింది. దీంతో బ్రిటన్, అమెరికాలు ఉలిక్కిపడ్డాయి. ఇరాన్ చమురు బయటకు వెళ్లకుండా బ్రిటన్ ఆంక్షలు విధించింది. జాతీయం చేసినందుకు నష్టపరిహారం ఇస్తామన్నా ఆంగ్లో-ఇరానియన్ కంపెనీ అంగీకరించలేదు. చమురుకు తోడు ఇతర ఆర్థిక ఆంక్షలనూ బ్రిటన్ విధించింది. ఆంక్షలు ఇరాన్‌ను కుంగదీయటం మొదలుపెట్టాయి. వేలాది మంది ఉద్యోగాలను కోల్పోయారు. విసిగిపోయిన మొసాద్దేగ్ ఒక దశలో రాజీనామా చేసినా ప్రజలు ఆందోళనలు చేసి మళ్లీ అధికారాన్ని కట్టబెట్టారు. చమురు రంగం జాతీయం చేయటానికే మొసాద్దేగ్ పరిమితం కాలేదు. చాలా సంస్కరణలనూ తీసుకు వచ్చారు. వెట్టిచాకిరీని నిర్మూలించారు. భూస్వాములపై 20 శాతం పన్నువేశారు. నిరుద్యోగ భృతిని ఏర్పాటుచేశారు. గ్రామాల్లో సౌకర్యాలను మెరుగుపరచారు. రాజకీయ స్వేచ్ఛను కల్పించారు. మహిళా హక్కులకు రక్షణ ఇచ్చారు. ప్రజాస్వామ్యం ఇరాన్‌లో అట్లా బలపడుతున్న తరుణంలో ఆపరేషన్ అజాక్స్ పేరుతో మొసాద్దేగ్ ప్రభుత్వాన్ని కూల్చటానికి అమెరికా, బ్రిటన్‌లు పావులు కదిపాయి. పార్లమెంటు అధికారాల్ని కుదించి షాకు అడ్డులేకుండా చేయటానికి అలజడులు లేవదీశాయి.

# బానిసలుగా కాదు నాయకులుగా ఎదుగుతాం

**- ఉత్తరాంధ్రలో విద్య, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగాలు స్థానికులకు 85 శాతం రిజర్వేషన్లు కల్పించాలి - స్థానికులకే జీవీఎంసి ఎలక్షన్స్ లో టికెట్లు ఇవ్వాలి - ప్రజల్లోకి ఉత్తరాంధ్ర పోరుబాట : ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి అధ్యక్షుడు రాజు గౌడ్ యాత డిమాండ్**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభు త్వంలో ఉత్తరాంధ్రాకి అనేక ప్రైవేటు కంపెనీలు వచ్చాయని చంద్రబాబు లోకేష్ నాయకత్వంలో విశాఖపట్నం అభివృద్ధి చెందుతుందని ఉత్తరాంధ్ర పోరుబాటను ప్రజల్లోకి తీసుకువెళ్లి బానిసలుగా కాదు. నాయకులుగా ఎదుగుతామని ఉత్తరాంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు గౌడ్ యాత పేర్కొ న్నారు. సోమవారం నగరంలో ఉత్తరాంధ్ర సమస్యలు పరిష్కార మార్గాలు అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజు గౌడ్ యాత మాట్లాడుతూ ఉత్తరాంధ్ర యువత ఏకం కావాలి అన్నారు. మన ఊరు, మన రాజ్యాధికారం అనే నినాదాలను చేపట్టి ముందుకు సాగాలన్నారు. తెలంగాణ తరహాలో ఉత్తరాంధ్రలో విద్య, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగాలు స్థానికులకు 85 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వలస వాదులు ఎక్కడ పోటీ చేస్తే అక్కడ ఉత్తరాంధ్ర వాసులు పోటీ చేసి వారిని ఓడించాలని అన్నారు. అన్ని రాజకీయ పార్టీ నేతలు స్థానికులకే రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. నిరుద్యోగ యువతను ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ పోరాటం లాంటి మరొక ఉత్తరాంధ్ర పోరాటం జరిగే అవకాశం ఉందని ఈ సందర్భంగా రాజు యాత హెచ్చరించారు. వెనుకబడిన ప్రాంతాల నిధులను ఉత్తరాంధ్రకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక జీవీఎంసీ ఎన్నికల్లో అన్ని పార్టీలు స్థానికులకే టికెట్లు కేటాయించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి తరపున అభ్యర్థులు ఇండిపెండెంట్లుగా నిలబడి ఇతర రాజకీయ నాయకులను ఓడిస్తారని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఉత్తరాంధ్ర పోరు బాట కార్యక్రమాన్ని ప్రజల్లోకి శరవేగంగా తీసుకు వెళుతున్నాం అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఉత్తరాంధ్రలో నాయకులే లేనట్లుగా ఎక్కడి నుంచో వలస నాయకులు వచ్చి ఇక్కడ ప్రాతినిధ్యం వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. దీనిని ఇతర రాజకీయ పార్టీలు టికెట్లు ఇచ్చి ప్రోత్సహించడం ఎంతవరకు న్యాయం అని రాజు యాత ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర నాయకులు యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రాజు యాతను ఘనంగా సన్మానించారు.

# మార్చి 26న థియేటర్లలో 'బ్యాండ్ మేళం' మోత!

**- విశాఖలో చిత్ర యూనిట్ సందడి - తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో బావ-మరదళ్ల ప్రేమకథ**

**- వైజాగ్ నా రెండో హోమ్ టౌన్ : నిర్మాత కోన వెంకట్**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వైవిధ్యభరితమైన కథాంశంతో, బావ-మరదళ్ల అనుబంధం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బ్యాండ్ మేళం' కోన వెంకట్ ప్రొడక్షన్, మ్యాంగో మాస్ మీడియా సంయుక్త సమర్పణలో రూపొందిన ఈ చిత్రం మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆదివారం విశాఖలోని ద్వారకానగర్ 'బుదిల్ పార్క్' హోటల్‌లో చిత్ర యూనిట్ మీడియా సమావేశాన్ని నిర్వహించింది. 'కోర్ట్' సినిమాతో మెప్పించిన హర్ష రోషన్, శ్రీదేవి జంట ఈ సినిమాతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు.

**వైజాగ్ నా సెంటిమెంట్: కోన వెంకట్**

ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట్ మాట్లాడుతూ. విశాఖపట్నంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. "ఒకరికి ఒకరు, అమ్మ నాన్న తమిళ అమ్మాయి, వెంకీ, నిన్ను కోరి నుంచి వాల్తేరు వీరయ్య వరకు నేను రాసిన సినిమాల్లో విశాఖ ఒక పాత్రగా ఉంటుంది. ఇది నా రెండో హోమ్ టౌన్ చాలా కాలం తర్వాత తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో చక్కని బావ-మరదళ్ల కథతో ఈ సినిమా వస్తోంది. ఇందులో సిట్యువేషనల్ కామెడీ అద్భుతంగా పండింది" అని పేర్కొన్నారు. తన కుమార్తెలు కావ్య, శ్రావ్య ఈ చిత్రానికి నిర్మాతలుగా వ్యవహరించడం విశేషమని ఆయన తెలిపారు.

**క్లైమాక్స్ ఊహకందని విధంగా ఉంటుంది: హీరో హర్ష రోషన్**

హీరో హర్ష రోషన్ మాట్లాడుతూ కోన వెంకట్ వంటి దిగ్గజాల పర్యవేక్షణలో పనిచేయడం అదృష్టమని అన్నారు. ఇందులో సంగీతాన్ని ఇష్టపడే 'యాదగిరి' అనే పాత్రను పోషించానని, తన స్నేహితులతో కలిసి చేసే బ్యాండ్ మేళం సందడి ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుందన్నారు. క్లైమాక్స్ ఎవరూ ఊహించని విధంగా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**అందరి ఇళ్లలో జరిగే కథ: హీరోయిన్ శ్రీదేవి**

హీరోయిన్ శ్రీదేవి మాట్లాడుతూ.. 'కోర్ట్' సినిమాకు ఈ చిత్రం పూర్తిగా భిన్నంగా ఉంటుందని, ప్రతి కుటుంబంలో జరిగే కథలా ఉంటుందని చెప్పారు. దర్శకుడు సతీష్ జవ్వాది మాట్లాడుతూ.. గతంలో తాను కంటెంట్ రైటర్‌గా పనిచేసిన అనుభవం ఈ సినిమాను మలచడంలో తోడ్పడిందన్నారు. కుటుంబ భావోద్వేగాలతో పాటు వినోదానికి పెద్దపీట వేశామని తెలిపారు.

# పిచ్చుకల కోసం ధాన్యపు కంకులు కుచ్చులు కట్టండి

**- సమస్త జీవరాశినీ కాపాడుకోవాలి - పశుపక్ష్యాదులు కోసం నీరు ఏర్పాటు చేయాలి**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** డాక్టర్ శశిప్రభ, సిఇఒ, సిఫా ట్రస్ట్ పిచ్చుకల కోసం ధాన్యపు కంకులు కుచ్చులు కట్టండి అని సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశిప్రభ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం అనకాపల్లి జిల్లా కోటవురట్లలోని తమ కార్యాలయంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ ప్రతినిధి జె.రాజేశ్వరితో శిక్షణ ఇప్పించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పచ్చదనం పెంపొందించేందుకు 2006 నుండి 10 వేల మందికి హరిత రాయబారులు (గ్రీన్ అంబాసిడర్స్)లకు శిక్షణ ఇచ్చిన తమ సంస్థ నిరంతరం పర్యావరణ, జీవావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తుంది అన్నారు. ధాన్యం కంకులు కుచ్చులు తోరణాలు తయారీ విధానం మీద ప్రతీ సంవత్సరం శిక్షణ ఇవ్వడం జరిగుతోంది అన్నారు. తమ రైతులు, ఆదివాసీలు తమ జీవనంలో భాగంగా పశుపక్ష్యాదులకు నీరు ఏర్పాటు చేస్తున్నారని వివరిం చారు.

ఈ విధంగా ప్రతి ఒక్కరూ సమస్త జీవరాశినీ కాపాడుకోవాలని కోరారు. ధాన్యం కంకులు కుచ్చులు చెట్లకు పురుకూసతో కట్టి వేలాడ తీయడం, నీటి పాత్రలు ఏర్పాటు చేయడం ప్రతి ఒక్కరికీ ఆనందంగా ఆనందం కల్పించె అంశం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లోవకుమారి, రాజ్యలక్ష్మి, రామలక్ష్మి, సింధిరి కుమారి, మణి కాంతేశ్వరి, స్వప్న, నర్సింగ్, మూర్తి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెనిద్రలో చట్టాలపై అవగాహన




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** నూతన క్రిమినల్ చట్టాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, తగు చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సామర్లకోట సీఐ ఏ కృష్ణ భగవాన్ పిలుపు ఇచ్చారు. సామర్లకోట మండలం కాపవరం గ్రామంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణ భగవాన్ మాట్లాడుతూ నేరరహిత సమాజం లక్ష్యంగా పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణ, మహిళా సాధికారిత, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన పలు అంశాలపై గ్రామంలో ప్రజలకు, నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కుటుంబాలకు దొరబాబు పరామర్శ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జ్ దవులూరి దొరబాబు సోమవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి, ఇటీవల మరణించిన కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ కురుమభాలకు ధైర్యం చెప్పారు. పెద్దాపురం మండలం చదలాడ గ్రామంలో ఆవల రామకృష్ణ కుటుంబాన్ని, ఉలిమేశ్వరం గ్రామంలో మొగలి రేవతి కుటుంబాన్ని, సామర్లకోట పట్టణంలోని నాతి వెంకటరమణ కుటుంబాన్ని సందర్శించి కుటుంబాల్లో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగిసిన ప్రజ్ఞ వికాస పరీక్షలు



**కరప, (రాజధాని వార్తలు):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీలలో ప్రజ్ఞ వికాస పరీక్షలు భారత విద్యార్థి ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంయుక్తంగా నిర్వహించారు. మండలంలో కరప, వేములవాడ, వేళంగి హైస్కూళ్లలో ఈ పరీక్షలు నిర్వహించబడినట్లు భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.సంజయ్ వెల్లడించారు. పరీక్షల్లో ఆయా పాఠశాలల్లో మొదటి స్థానాలు సాధించిన విద్యార్థులకు సోమవారం కరప హైస్కూల్‌లో అభినందన సభ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. లోవరాజు మాట్లాడుతూ ప్రజ్ఞ వికాస పరీక్షలు విద్యార్థుల్లో ఉన్న పరీక్షా భయాన్ని తొలగించి చదువుపై ఆసక్తి పెంపొందించడానికి ఉపయోగపడతాయని అన్నారు. స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమ తులను ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కరప మండల నాయకుడు విష్ణు సహకారంతో బహుమతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్య క్షుడు సి.హెచ్.లోవరాజు, జిల్లా సహాయ కార్యదర్శి ఎ.సంజయ్, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల నాయకులు సత్యనారాయణ మూర్తి, కరప హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రాజారాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వృక్షాల మాయంపై ఆర్డీవోకు ఫిర్యాదు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం వాలు తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు వృక్షాలను నరుకుకొని అపహరించడంపై గ్రామానికి చెందిన న్యాయవాది చిలకపాటి సుదర్శన్ పెద్దాపురం ఆర్డీవోకు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎవరి అనుమతి లేకుండా గుర్తుతెలియని వ్యక్తులు చెట్లు నరుకుకొని తీసుకు వెళ్లడంపై మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశామన్నారు. అయినా ఆయన పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఆర్డీవో కార్యాల యంలో ఫిర్యాదును అందజేశామన్నారు. సుమారు రెండు లక్షలు విలువ చేసే వృక్షాలను ఎవరో దొంగిలించగా దానిపై విచారణ జరపలేదన్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు దీనిపై విచారణ జరిపి చెట్లను అపహరించిన వారి నుండి వాటి విలువైన సొమ్మును రికవరీ చేసి ప్రభుత్వ ఖజానాలో సొమ్మును జమ చేయాలని, తద్వారా ఇలాంటి చోరీలను అరికట్టాలని, దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

# సల్మాన్ సూపర్‌హీరో సినిమాలో సౌత్ బ్యూటీ జాక్‌పాట్



బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ తన కెరీర్‌లో సరికొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న సౌత్ డైరెక్టర్ల వైపు మొగ్గు చూపుతున్న సల్మాన్, ఈసారి పాన్ ఇండియా స్థాయిలో భారీ సూపర్ హీరో చిత్రాన్ని ప్లాన్ చేశారు. ది ఫ్యామిలీ మ్యాన్, ఫర్జీ వంటి బ్లాక్ బస్టర్ వెబ్ సిరీస్‌ల సృష్టికర్తలు రాజ్ అండ్ డీకే ఈ చిత్రానికి దర్శకత్వం వహించనుండటం విశేషం. ఈ క్రేజీ కాంబినేషన్ అనౌన్స్‌మెంట్ రాకముందే బాలీవుడ్ సర్కిల్స్‌లో ఈ ప్రాజెక్ట్ గురించి వాడివేడిగా చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ సరసన నటించబోయే కథానాయిక ఎవరనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రధానంగా సౌత్ లేడీ సూపర్ స్టార్ నయనతార.. టాలెంటెడ్ బ్యూటీ సమంత పేర్లు వినిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతానికి అందుతున్న సమాచారం ప్రకారం.. సమంతే ఈ రేసులో ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో వచ్చిన ది ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్: హనీ బన్నీ ప్రాజెక్టుల ద్వారా సమంతకు ఆ దర్శకులతో మంచి అనుబంధం ఉండటమే దీనికి ప్రధాన కారణం. సమంత ఫేవరెట్ కావడానికి మరో బలమైన కారణం ఈ బ్యూటీకి యాక్షన్ పాత్రల్లో ఉన్న పట్టు. ఈ చిత్రం సూపర్ హీరో కథాంశంతో సాగడం వల్ల.. కథానాయిక పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా పవర్‌ఫుల్ యాక్షన్ ప్యాక్డ్ రోల్‌గా ఉంటుందని సమాచారం. ఫ్యామిలీ మ్యాన్‌లో రాజీగా, సిటాడెల్‌లో గూఢచారిగా సమంత కనబరిచిన పరాక్రమం చూసిన తర్వాత సల్మాన్ ఖాన్‌లాంటి భారీ యాక్షన్ స్టార్ పక్కన సమంత సరిగ్గా సరిపోతుందని దర్శకులు భావిస్తున్నారు. మరోవైపు నయనతార పేరు కూడా గట్టిగానే పరిశీలనలోకి వచ్చింది. ఇప్పటికే సల్మాన్ ఖాన్ ఏఆర్ మురుగదాస్ కాంబినేషన్‌లో వచ్చిన సికందర్‌లో నయన్ నటించాల్సి ఉన్నా అప్పుడు కుదరలేదు. అందుకే ఇప్పుడు సల్మాన్ భాయ్ ఆఫర్ ఇవ్వాలని భావించారట. కానీ రాజ్ అండ్ డీకే సమంతను ఫైనల్ చేసారని గుసగుస వినిపిస్తోంది. దర్శకద్వయం మేకింగ్‌కు సమంత మరింత ఈజీగా సెట్ అవుతుందనేది ఇన్ సైడ్ టాక్. సల్మాన్ ఖాన్ తన ఇమేజ్‌ను పూర్తిస్థాయిలో రీబూట్ చేసే క్రమంలో ఈ సూపర్ హీరో చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు.

టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఉండే రాజ్ అండ్ డీకే మేకింగ్‌కి సల్మాన్ మాస్ ఇమేజ్ తోడైతే ఇండియన్ బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజె క్టులో సమంత ఫైనల్ అయితే.. సల్మాన్ – సమంత కాంబినేషన్‌లో వచ్చే మొదటి చిత్రంగా ఇది భారీ హైప్‌ను అందుకుంటుంది.

త్వరలోనే ఈ భారీ ప్రాజెక్టుకు సంబంధించి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. సల్మాన్ భాయ్ ఈసారి విదేశీ టెక్నీషియన్లు, సౌత్ టాలెంట్‌ను మిక్స్ చేసి సరికొత్త విజువల్ వండర్‌ను ఆవిష్కరించాలని చూస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్లకే కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే సల్మాన్ మొదటిసారి సూపర్ హీరో పాత్రలో ఎలా కనిపిస్తారో.. సమంత అతడికి ఎలాంటి సపోర్ట్ ఇస్తుందో చూడాలని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# ఇకపై అలాంటి పాత్రలు చేయను.. హరితేజ షాకింగ్ స్టేట్మెంట్



బుల్లితెరపై యాంకర్‌గా, సీరియల్ నటిగా ఎంట్రీ ఇచ్చి.. వెండితెరపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి హరితేజ. బిగ్ బాస్ హౌస్‌లో తన సందడితో అందరినీ మెప్పించిన ఈమె, తాజాగా తన సినిమా కెరీర్‌పై కొన్ని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకే రకమైన పాత్రలు తనను వెంటాడుతున్నాయని, ఆ ముద్ర తన జీవితాంతం పోయేలా లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అసలు హరితేజ అంతలా ఫీలవ్వడానికి కారణమైన ఆ పాత్రలేంటి? ఆమె ఏమన్నారో ఇప్పుడు చూద్దాం. హరితేజ అంటే మనకు వెంటనే గుర్తొచ్చేది ఆమె హుషారైన మాటలు, సహజమైన నటన. అయితే త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వచ్చిన 'అ ఆ' సినిమా ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ సినిమాలో సమంత దగ్గర పనిమనిషిగా ఆమె చేసిన కామెడీ టైమింగ్ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. కానీ, అదే ఇప్పుడు ఆమెకు ఇబ్బందిగా మారిందట. ఆ సినిమా తర్వాత ఆమెకు వచ్చే ఆఫర్లన్నీ దాదాపు అలాంటివే కావడం గమనార్హం. "ఆ పాత్రకు నేనే బ్రాండ్ అంబాసిడర్‌లా మారిపోయాను.. అందరూ అవే రోల్స్ ఇస్తున్నారు" అంటూ ఆమె సరదాగా చెబుతూనే, తనలోని నటిని ఒకే ఇమేజ్‌కు పరిమితం చేస్తున్నారనే అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇక బిగ్ బాస్ మొదటి సీజన్‌లో జూనియర్ ఎన్టీఆర్ హోస్టింగ్‌లో హరితేజ చేసిన సందడి అంతా ఇంతా కాదు. ఆమె చెప్పే హరికథలు, ఆమె పాటలు అప్పట్లో ఒక ఊపు ఊపేశాయి. బిగ్ బాస్ సీజన్ 8లో కూడా అడుగుపెట్టి తన మార్క్ ఎంటర్టైన్మెంట్ అందించారు. సీరియల్స్ నుంచి సినిమాల వరకు ఎక్కడ ఉన్నా తనదైన శైలిలో రాణిస్తున్న ఈమె, ఇప్పుడు వెబ్ సిరీస్‌లపై కూడా ఫోకస్ పెట్టారు. మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'లేచింది మహిళా లోకం' వంటి క్రేజీ ప్రాజెక్టులలో కీలక పాత్రలు పోషిస్తూ బిజీగా ఉన్నారు.

విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనపై ఉన్న పాత ఇమేజ్‌ను చెరిపేసే ప్రయత్నం చేస్తున్నారు. చాలా కాలం పాటు తనకు వచ్చిన పనిమనిషి పాత్రలను కాదనలేక చేసిన హరితేజ, ఇప్పుడు మాత్రం ఒక నిర్ణయానికి వచ్చారట. ఇకపై అలాంటి పాత్రలను వీలైనంత వరకు తగ్గించాలని, తనలోని అసలైన నటిని బయటకు తీసే కొత్త కొత్త ఛాలెంజింగ్ రోల్స్ చేయాలని ఆమె భావిస్తున్నారు. "నా గతం నన్ను వదిలిపెట్టడం లేదు.. కానీ నేను మాత్రం కొత్తగా ఏదైనా చేయాలనుకుంటున్నాను" అని ఆమె స్పష్టం చేశారు. కేవలం కామెడీకే కాకుండా ఎమోషనల్ సీన్స్‌లో కూడా తాను మెప్పించగలనని నిరూపించుకోవడమే ఆమె ప్రస్తుత లక్ష్యం. అందుకే ఆఫర్లు వస్తున్నా, ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు ఆమె ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు.

# త్రిష ఫైర్ అవ్వడంతో సీన్ రివర్స్!



గలాట్టా అవార్డ్స్ వేదికగా నటి త్రిషపై నటుడు, దర్శకుడు పార్థిబన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపాయి. తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని పార్థిబన్ వివరణ ఇస్తూ ఒక వీడియో విడుదల చేశారు. అయితే జరిగిన తప్పుపై పశ్చాత్తాపం చూపకుండా ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకోవాలని చూస్తున్నారని నెటిజన్లు ఆయనపై మండిపడుతున్నారు. మైక్రోఫోన్ ముందు మాట్లాడినంత మాత్రాన అది తెలివైన మాట అయిపోదని, కేవలం సౌండ్ మాత్రమే పెరుగుతుందని త్రిష గట్టిగా బదులివ్వడం గమనార్హం. అసలు ఏం జరిగిందంటే, అవార్డు వేడులో త్రిష ఫోటో స్క్రీన్‌పై కనిపించినప్పుడు ఆమె పోషించిన 'కుందవై' పాత్రను ఉద్దేశించి పార్థిబన్ ఒక కామెంట్ చేశారు. "సమస్యలు రాకుండా ఉండాలంటే కుందవైని ఇంట్లోనే కూర్చోబెట్టాలి" అనే అర్థం వచ్చేలా ఆయన మాట్లాడారు. విజయ్ రాజకీయ ఎదుగుదల, త్రిషతో ముడిపెడుతూ వస్తున్న కొన్ని యూట్యూబ్ వీడియోల ప్రభావంతోనే తాను ఆవేదనతో అలా అన్నానని పార్థిబన్ చెప్పుకొచ్చారు. కానీ ఒక స్టార్ హీరోయిన్‌ను ఉద్దేశించి వేదికపై అలా మాట్లాడటం ఏమాత్రం సమంజసం కాదని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. స్టేజ్ దిగిన వెంటనే తన స్నేహితుడు ఒకరు ఆ వ్యాఖ్యల గురించి హెచ్చరించడంతో, పార్థిబన్ వెంటనే నిర్వాహకులను కలిసి ఆ క్లిప్‌ను తొలగించమని కోరారు. కానీ దురదృష్టవశాత్తు మరుసటి రోజు ఉదయానికే ఆ వీడియో సోషల్ మీడియాలో లీక్ అయ్యి వైరల్ అయ్యింది. మహిళా దినోత్సవం సందర్భంగా ఒక వీడియో రికార్డ్ చేసి తన విచారాన్ని వ్యక్తం చేయాలని భావించినా, సాంకేతిక కారణాల వల్ల అది ఆలస్యమైందని ఆయన వివరించారు. ఈలోపే త్రిష సోషల్ మీడియాలో స్పందించడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. పార్థిబన్ వివరణ ఇస్తూ.. త్రిష ఫోటోను స్క్రీన్‌పై ప్రదర్శించమని ఎవరో కావాలనే నిర్వాహకులను కోరారని ఆమె చేసిన పోస్ట్ చూసి తాను చాలా బాధపడ్డానని అన్నారు. ఒకవేళ త్రిష అప్పటికే ఈ విషయంపై అంత ఘాటుగా స్పందించిందని తనకు ముందే తెలిసి ఉంటే, తాను వివరణ ఇస్తూ ఆ వీడియోను విడుదల చేసేవాడిని కాదని పార్థిబన్ పేర్కొన్నారు. తన మాటల వెనుక ఎటువంటి దురుద్దేశం లేదని ఆయన సమర్థించుకున్నా, త్రిష ఫ్యాన్స్ మాత్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ వివాదం కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. పార్థిబన్ మాత్రం తన వివరణతో ఈ గొడవను సద్దుమణిగించే ప్రయత్నం చేస్తున్నారు. మరి ఈ వివరణతోనైనా ఈ వివాదానికి ముగింపు పడుతుందో లేదో చూడాలి.

# ఫైట్ మాస్టర్‌తో గోపీచంద్ క్రేజీ ప్రాజెక్ట్!



టాలీవుడ్ స్టార్ హీరోల్లో రేసులో వెనకబడి ఉన్న స్టార్ గోపీచంద్. మ్యాచో మ్యాన్‌గా పేరు తెచ్చుకున్న ఈ హీరో గత కొంత కాలంగా భారీ కమర్షియల్ బ్లాక్ బస్టర్ కోసం ఎదురు చూస్తున్నారు. హీరోగా కెరీర్ ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కమర్షియల్ స్టార్‌ల జాబితాలో చేరలేకపోతున్నారు. టీ.కృష్ణ వారసుడిగా అరంగేట్రం చేసినా మొదట్లో చూపించిన స్థాయిలో వేగం చూపించలేకపోతున్నారు. సక్సెస్‌లు కూడా అదే స్థాయిలో ఆయనతో దోబూచులాడుతున్నాయి. తన తరువాతే కెరీర్ స్టార్ట్ చేసిన హీరోలంతా రేసులో ఓవర్ టేక్ చేసేసి ముందుకు దూసుకుపోతున్నా గోపీచంద్‌కు మాత్రం కాలం కలిసి రావడం లేదు. దీంతో ఇప్పటి వరకు స్టార్స్ జాబితాలో చేరే కమర్షియల్ బ్లాక్ బస్టర్‌ని దక్కించుకునే పనిలో ఉన్నారు. ఘాజీ ఫేమ్ సంకల్ప్ రెడ్డితో ప్రస్తుతం ఓ భారీ సినిమాకు శ్రీకారం చుట్టారు. ఇది గోపీచంద్ నటిస్తున్న 33వ సినిమా. దీన్ని భారీ స్థాయిలో ప్లాన్ చేశారు. సంకల్ప్ రెడ్డి ఘాజీ తరువాత మళ్లీ ఆ స్థాయి సక్సెస్‌ని సొంతం చేసుకోలేకపోయారు. దీంతో ఈ సారి ఎలాగైనా షూర్ షాట్ బ్లాక్ బస్టర్‌ని ఖాతాలో వేసుకుని మళ్లీ ట్రాక్‌లోకి రావాలనే ప్రయత్నాల్లో భాగంగా ఈ మూవీని అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. దీనికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. రీతువర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. 25 రోజుల పాటు క్లైమాక్స్‌ని షూట్ చేయబోతున్నారు. దీనికి ముగ్గురు ఫైట్ మాస్టర్లు వర్క్ చేస్తున్నారు. సంకల్ప్, గోపీచంద్ గత చిత్రాలకు పూర్తి భిన్నంగా హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ మూవీ ఇంటర్వెల్ బ్యాంగ్ కూడా సరికొత్తగా ఉంటుందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ మూవీతో పాటు గోపీచంద్ మరో భారీ యాక్షన్ డ్రామాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలిసింది. ఈ మూవీ ద్వారా క్రేజీ ఫైట్ మాస్టర్ వెంకట్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. గోపీచంద్‌ని దృష్టిలో పెట్టుకునే సరికొత్త నేపథ్యంలో ఆయన కథని రాసుకున్నారట.

ఇటీవలే ఆయనకు వినిపించడం, ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చేయడం జరిగిందని తెలిసింది. ఈ భారీ యాక్షన్ డ్రామాని యాత్ర మూవీని నిర్మించిన 70 ఎం.ఎం బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించనున్నారు. దీనికి సంబం ధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ మొదలు పెట్టిన టీమ్ ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్‌ని జూన్ నుంచి ప్రారంభించాలని ప్లాన్ చేస్తోందట. ఇందులో గోపీచంద్‌కు జోడీగా నటించే హీరోయిన్ ఎవరు? కీలక పాత్రల్లో ఎవరెవరు నటిస్తారు? వంటి వివరాలతో పాటు సాంకేతిక నిపుణుల వివరాల్ని టీమ్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనుంది.

# పిజిఆర్ఎస్ అర్జీలను గడువులోగా పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి






**విజయనగరం, (రాజధాని వార్తలు):** పి జి ఆర్ ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలలో ప్రజలు అందజేసిన అర్జీలను నిర్ణీత గడువులోపల పరిష్కరించాలని, అర్జీలు రీఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పి జి ఆర్ ఎస్., రెవెన్యూ క్లినిక్, సానుకూల ప్రజా స్పందన తదితర అంశాలపై సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పి జి ఆర్ ఎస్, రెవిన్యూ క్లినిక్ కార్యక్రమాలలో వచ్చిన అర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ అర్జీలను నిర్ణీత గడువులాగా పరిష్కరించాలని ఆదేశించారు. గడువు దాటిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడాలని, సరియైన ఎండార్సుమెంట్ ఇవ్వాలని, ఎండార్సుమెంట్ కాపీని అర్జీదారులకు అందజేయాలన్నారు. అర్జీదారులతో మాట్లాడి అర్జీ పరిష్కారం గురించి వివరించాలని, పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను వివరించడం ద్వారా అర్జీ రీఓపెన్ కాకుండా నివారించవచ్చునని తెలిపారు. రెవెన్యూ క్లినిక్ అర్జీలు కూడా వెంటనే పరిష్కరించాలని, గడువు దాటిన అర్జీలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తాసిల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలను విధిగా సందర్శించాలని చేయాలని, వారు నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ ఆదేశించారు. ఏకీకృత కుటుంబ సర్వే, బంగారు కుటుంబ వెరిఫికేషన్ కార్యక్రమాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రజల సంతృప్తి స్థాయిలు నూరుశాతం సాధించే విధంగా శాఖలు పని చేయాలన్నారు. ప్రతి అధికారి వారి శాఖకు సంబంధించిన పనితీరును సమీక్ష చేసుకుని, ప్రజల నుండి సంతృప్త, సానుకూల స్పందన పొందాలని తెలిపారు. 14-15 సంవత్సరాల బాలికలకు అందిస్తున్న హెచ్ పి వి వాక్సిన్ (సర్వైకల్ కాన్సర్ వాక్సిన్) కార్యక్రమం ద్వారా అర్హులైన బాలికలందరికి వాక్సిన్ అందజేయాలని తెలిపారు. 3 నెలలు నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాలలు, వసతి గృహాలలో గల బాలికలతో పాటు, 15 సంవత్సరాలు పూర్తి కావస్తున్న బాలికలకు ప్రాధాన్యతనిస్తూ తొలి విడతలోనే వాక్సిన్ అందజేయాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హెచ్. సత్తిబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సీతంలో స్వయం ఉపాధి అవకాశాల కోసం "ఏజెంటిక్ ఏఐ"పై ముగిసిన కార్యశాల







**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో కంప్యూటర్ సైన్స్ మరియు ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏపీఎంఎస్ఎంఈ-జేఎన్‌టీయూ-జీవీ సంయుక్త ఆధ్వర్యంలో ఈఎస్‌డీపీ ఫిబ్రవరి 13 నుండి మార్చి 9 వరకు స్వయం ఉపాధి అవకాశాల కోసం "ఏజెంటిక్ ఏఐ" కార్యశాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ర్యాంప్ పథకం కింద ప్రపంచ బ్యాంకు సహకారంతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ-జీవీ విశ్వవిద్యాలయం మరియు ఎంఎస్ఎంఈ సంస్థ మార్గదర్శకత్వం అందించగా, "స్వయం ఉపాధి కోసం ఏజెంటిక్ ఏఐ" అనే అంశంపై ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆధునిక కృత్రిమ మేధస్సు నైపుణ్యాలను అందించి, అభివృద్ధి చెందుతున్న డిజిటల్ సాంకేతిక రంగాలలో పారిశ్రామిక అవకాశాలను అన్వేషించేందుకు ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ 20 రోజుల శిక్షణా కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ మరియు ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాయోగిక శిక్షణ, సాంకేతిక ప్రదర్శనలు నిర్వహించబడగా, విద్యార్థులు ఏజెంటిక్ ఏఐ వ్యవస్థల భావనలు మరియు వాటి అనువర్తనాలను అవగాహన చేసుకున్నారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు బృందాలుగా పని చేసి అనేక వినూత్న కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రాజెక్టులను అభివృద్ధి చేశారు. ముఖ్యంగా అభివృద్ధి చేసిన ప్రాజెక్టులలో కోడింగ్ ఇంటర్వ్యూ ఏజెంట్, వాయిస్ కంట్రోల్డ్ అసిస్టెన్స్ సిస్టమ్, ఏఐ ట్రిప్ ప్లానర్, స్మార్ట్ వెదర్ బేస్డ్ యాక్టివిటీ ప్లానర్, నెక్స్ట్‌హైర్ - జాబ్ సెర్చింగ్ ఏజెంట్, వెబ్ సెర్చ్ మరియు సమ్మరైజర్, ప్రాంప్ట్ టు మెయిల్, కోడ్ ఇంటెలిజెన్స్ ఏజెంట్, పర్సనల్ క్యాలెండర్ ఏజెంట్ మరియు మ్యాథ్ సాల్వర్ బాట్ ఉన్నాయి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు కృత్రిమ మేధస్సు ఆధారిత సమస్య పరిష్కారం, ఆటోమేషన్ మరియు తెలివైన సహాయక వ్యవస్థల అభివృద్ధి వంటి అంశాలను అన్వేషించే అవకాశాన్ని పొందారు. అదే సమయంలో విద్యార్థుల్లో సృజనాత్మకత, నవీన ఆలోచనలు మరియు పారిశ్రామిక దృక్పథం పెంపొందించబడింది. ఈ కార్యక్రమం విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు, నవీన ఆలోచనలను ప్రోత్సహించేందుకు మరియు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు మరియు కార్యాశాలలు భవిష్యత్తులో కూడా నిర్వహించబడతాయని సీతం యాజమాన్యం తెలియజేసింది.

# కాశీ విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రదీప్ నాయుడు, సిరమ్మ





**కాశీ, (రాజధాని వార్తలు):** ఉత్తరప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాశీ విశ్వేశ్వరుని ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) సతీమణి మజ్జి పుష్పాంజలి, అల్లుడు నెల్లిమర్ల నియోజకవర్గం వైస్సార్ సీపి యువజన విభాగం అధ్యక్షులు ప్రదీప్ నాయుడు, కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ఆదివారం నాడు కాశీ విశ్వేశ్వరుని దర్శించి పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదం పొందారు.

# విజయనగరం జేఎన్టీయూ జీవీలో ECENTRA-2కె26 సాంకేతిక ఉత్సవం

## - ఘనంగా ప్రారంభించిన వీసీ ప్రొ.వీవీ సుబ్బారావు





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక రంగాలలో నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో మంచి అవకాశాలు పొందవచ్చని జేఎన్టీయూ జీవీ వైస్ ఛాన్సలర్ ప్రొ.వీవీ సుబ్బారావు అన్నారు. అలాగే ఇలాంటి సాంకేతిక ఉత్సవాలు విద్యార్థులలో సృజనాత్మకత, పరిశోధనాత్మక దృక్పథం మరియు ఆవిష్కరణా సామర్థ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. Jawaharlal Nehru Technological University-Gurajada Vizianagaramకు అనుబంధంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ECENTRA-2కె26 సాంకేతిక ఉత్సవం నిర్వహించారు. AB-II ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10.00 గంటలకు ఈ కార్యక్రమాన్ని వైస్ ఛాన్సలర్ ప్రొ.వీవీ సుబ్బారావు ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుండి విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**సాంకేతిక పోటీలు నిర్వహణ**

రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో టెక్నికల్ పేపర్ ప్రజెంటేషన్స్, పోస్టర్ ప్రజెంటేషన్స్, ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్స్ మరియు వివిధ సాంకేతిక పోటీలు నిర్వహించబడుతున్నాయి. జనరల్ నాలెడ్జ్, ఆప్టిట్యూడ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, క్విజ్ ఈ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

రెండు రౌండ్లలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు అవార్డుతోపాటు జేఎన్టీయుూజీవీ సర్టిఫికెట్ సైతం అందజేనున్నారు. ECENTRA-2కె26 సాంకేతిక ఉత్సవంకు ప్రత్యేక అతిథిగా శాస్త్రవేత్త బీ వెంకట రమణ హాజరయ్యారు. గౌరవ అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ కేసీబీ రావు హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమానికి చైర్మన్‌గా టీఎస్ఎన్ మూర్తి వ్యవహరించగా, కన్వీనర్‌గా కే బాబులు వ్యవహరించారు. అలాగే ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌గా ఈసీఈ విభాగం అసోషియేటివ్ ప్రొఫెసర్ డాక్టర్.బీ నళిని వ్యవహరించారు. అలాగే విద్యార్థి సమన్వయకర్తగా బీటెక్ ఫోర్త్ ఇయర్ స్టూడెంట్ ఎస్.జాహ్నవి వ్యవహారించారు.

# కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

## - రూ. 20 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలి - కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కేజీహెచ్‌లో వైద్యం పొందుతూ మృతి చెందిన బాలుడు కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన దక్షిణ వైసీపీ శ్రేణులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇది ప్రభుత్వ హత్యగా ఆయన అభివర్ణించారు. ఇటీవల కేజీహెచ్‌లో ఇటువంటి ఘటనలు వరుసగా జరుగుతున్నాయని తిరిగి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని అన్నారు. చాలావరకు ప్రైవేటు ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో ఎక్కువమంది ప్రజలు కేజీహెచ్ ను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. దీంతో ఈ ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది అన్నారు. అయితే కేజీహెచ్‌లో సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో జాప్యం జరుగుతుందన్నారు. అక్కడ పనిచేస్తున్న పరిమిత సిబ్బంది ఎక్కువగా వస్తున్న రోగులకు మంచి చికిత్స అందిస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. కే జి హెచ్‌కు వస్తున్న రోగుల డిమాండ్ మేరకు ఎక్కువ సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. కానీ అటువంటి పరిస్థితి లేదని వాపోయారు. ఈ కారణంగా ఇక్కడ వైద్యులు ఎక్కువ సమయం కేటాయిస్తూ పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆరేళ్ల వానపల్లి అక్షయ కుమార్ చికిత్స పొందుతూ ఇక్కడ మృతి చెందడం చాలా విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బాలుడికి ఆపరేషన్ జరిగిన రోజునే కేజీహెచ్‌లో 13 సర్జరీలు జరిగాయని చెప్పారు. కానీ దురదృష్టవశాత్తు ఆ బాలుడు మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఆ బాలుడు తండ్రి వాచ్మెన్‌గా పనిచేస్తున్నాడని చాలా దయనీయ స్థితిలో ఆ కుటుంబం ఉందని తెలిపారు. ప్రభుత్వం మానవత్వంతో స్పందించి ఆ బాలుడు కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు రావాలన్నారు. ఆ కుటుంబానికి తక్షణమే 20 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే కేజీహెచ్లో రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అవసరమైన పోస్టుల భర్తీ చేయకపోవడంతో వైద్యులపై పని ఒత్తిడి అధికంగా ఉందన్నారు. మానవతా దృక్పథంతో వైద్యులు పనిచేస్తున్నప్పటికీ మ్యాన్ పవర్ లేకపోవడంతో తప్పిదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, అలాగే వైద్య పని ఒత్తిడి తగ్గించేలా సిబ్బందిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, రొంగలి జగన్నాథం, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, 42వ వార్డు అధ్యక్షుడు బీశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సముద్రాల గిరిజా ప్రసన్నకు ఉత్తమ మహిళా పురస్కారం



**విజయనగరం, (రాజధాని వార్తలు):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో బిర్లా సైన్స్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో ఉపాధ్యాయ రంగంలో గడిచిన 23 సంవత్సరాలుగా అందిస్తున్న సేవలను గుర్తించి విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన ది వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయురాలు సముద్రాల గిరిజా ప్రసన్నకు ఉత్తమ మహిళా పురస్కారాన్ని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రదానం చేశారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ చిలుముల బాల్ రెడ్డి అధ్యక్షతన పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన 20 మంది మహిళలకు పురస్కారాలు అందజేశారు. ఈ వేడుకల్లో అసోసియేషన్ అధ్యక్షులు అద్దంకి రాజా, కాంతిరేఖ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా విచారణ చేసి గడువులోపు అర్జీలను పరిష్కరించాలి

## - నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రజలు ప్రజల నుండి వచ్చిన వినతులను పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, డిప్యూటి కలక్టర్ మురళి, డీ.ఎస్.ఓ లీలారాణి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డి.డి నాగ శేఖర్, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు మరియు పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రజా సమస్య పరిష్కార వేది కలో వచ్చిన అర్జీలను బియాండ్ యస్.యల్.ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు నెం. 06 ను అనుసరించి జిల్లాలోని అన్ని శాఖలలో అర్హత కలిగిన వారందరికీ త్వరితగతిన పదోన్నతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అవసరమైన శాఖలలో పానల్ జాబితాలను తయారు చేసి పదోన్నతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖలు తమ పరిధిలో జిల్లా అభివృద్ధికి చేయవలసిన పనులు మరియు పాలసీ మ్యాటర్లకు సంబంధించిన విషయాలను తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే సదరు విషయాలను జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి మరియు పై అధికారుల దృష్టికి సరైన సమయాన్ని బట్టి తీసుకొని వచ్చి జిల్లా అభివృద్ధికి తోడ్పడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లును జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీల స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతపాటు షామ్యానలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజాపిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమములో డిప్యూటి కలెక్టర్ మురళి, డి.పి.ఓ వసుమతి, పి.డి. డి.ఆర్.డి.ఎ నాగ రాజకుమారి, బి.సి సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బండి బాట సమస్య పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం : నిరుపేద రైతులు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఏర్పేడు మండలంలో నిరుపేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన డికేటీ భూముల్లో కొంత మంది పలుకుబడి కలిగిన రైతులు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అడంగల్, ఎఫ్ఎంబి రిజిస్టర్‌లో దారిగా ఉన్నప్పటికీ ఆ దారి భూమిని కొంత మంది ఆక్రమించుకుని రైతులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ వున్నారు. అది ఎందుకంటే ప్రధాన రహదారి నుండి పంట పొలాలకు వెళ్లే బండి బాటను మొదట్లో వున్న రైతులు ఆక్రమించి ఆ పై వున్న భూముల్లోకి రైతులు వెళ్లకుండా ఇబ్బందులకు గురి చేస్తూ ఉన్నట్లు పలువురు రైతులు వాపోతున్నారు. వాస్తవానికి డీకేటి భూముల్లో పడించిన పంట దిగుబడిని, పంటలు సాగుచేయడానికి వీలుగా ప్రభుత్వం ముందుచూపుతో బండి బాట ఏర్పాటు చేశారని, కొంతమంది నిర్వాకం వల్ల తమ పంట పొలాలకు పోయి రావాలన్నా, పండించే పంటను ఇంటికి తెచ్చుకోవడానికి ఇబ్బందిగా ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వంలోనైనా ఇలాంటి అక్రమాలు అధికంగా జరిగాయని, కూటమి ప్రభుత్వంలో బండి సమస్య తీరు తుందని తలచిన రైతులకు నేటికీ బండి బాట సమస్య తీరకపో వడంతో సమస్య మరింత జఠిలంగా ఏర్పడిందని పలువురు రైతులు వాపోతున్నారు. అయితే బండిబాటను పూర్తిగా ఆక్రమించుకొని ఇది మా భూమి అంటూ ఈ భూమిలో ఎవరు రాకపోకలు సాగించకూడదని, బండ్లు, ట్రాక్టర్లు పొలాల గుండా వెళ్ళకూడదంటూ హుకుం జారీ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తమ పొలం మీదుగా ఎలాంటి వాహనాలు, ట్రాక్టర్లు తీసుకురాకూడదని ఆంక్షలు విధిస్తూ ఎంతో మంది రైతులను ఇబ్బంది పెడుతున్నారని రైతులు తెలిపారు. ఇందులో ముఖ్యమైన విషయం ఏంటంటే రహదారికి సమీపంలో ఉన్న రైతులు ఆపై ఉన్న రైతులు భూములను కాజేయడానికి ఇలా ఇబ్బందులు సృష్టి సూచిస్తున్నారని తెలిసింది. బండిబాటను ఆక్రమించిన రైతుల మాట వినకుంటే, వారి మాట విని పొలాలు వారికి ఇవ్వకుంటే తప్పుడు కేసులు పెడుతూ వున్నారని, భూములు కాజేయడానికి ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే మరో కొంతమంది ఎఫ్ఎంబి అడంగల్‌లో బండి బాట ఉన్నట్టు స్కెచ్‌లో ఉన్నప్పటికీ ఆ దారులు పూర్తిగా మూసివేసి పక్క రైతులను పొలాల్లోకి వెళ్ళకుండా ఇబ్బందులు సృష్టిస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇదేమని అడిగితే దౌర్జన్యం చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నట్టు సమాచారం. ఇది తమ భూములు కాజేయడానికి వేసిన పెద్ద స్కెచ్‌గా తెలుస్తోందనే అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అందుకు ఉదాహరణగా ఏర్పేడు మండలంలోని కందాడు రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 270, 272, 282, 283, 293, 294లు ప్రధాన రహదారి నుంచి ఉన్న బండి బాటలు. ఉదాహరణగా చెప్పవచ్చు. ఇలాంటి బండిబాట వివాదాలు కందాడులో కోకొల్లలు. ఈ సర్వే నంబర్లుకు ప్రక్కన ఉన్న రైతులకు పంటలు సాగు చేయడానికి, పంట ఒబ్బిడి చేసి దిగుబడిని ఇంటికి చేర్చుకోవడానికి అనేక ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఇవేకాకుండా ఇలాగే ఎన్నో బండి బాటలు మూసివేశారని పలువురు రైతులు తెలిపారు. అదేవిదంగా రికార్డుల్లో బండి బాట లేకున్నా బండి బాట కల్పించాలని పలువురు సన్నకారు రైతులు రెవెన్యూ అధికార యంత్రాంగంను కోరుతున్నారు. అందువల్ల జిల్లా రెవిన్యూ అధికా రులు జోక్యం చేసుకుని బండి బాట విధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గత 40 సంవత్సరాల నుండి కొంతమంది మోతుబరి రైతులు పేదల భూములను కాజేయడా నికి బండి బాట ఆక్రమణ ఎత్తుగడతో పెత్తనం చెలాయిస్తూ సామాన్య, పేద బడుగు, బలహీన వర్గాలకు చెందిన రైతులకు సమస్యలను జఠిలం చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

# ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలుశిక్ష

## 6 లక్షలు రూపాయలు జరిమానా

**తిరుపతి, (రాజధాని వార్తలు):** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, 6 లక్షలు రూపాయలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎస్టీఎఫ్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి,కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దా యిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 10/2016 కేసులో ఈ ముద్దాయి తిరుపతి జిల్లా కరకంబాడీ ఫారెస్ట్ బీటు, సెక్షన్ అటవీ పరిధిలో అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, తిరువన్నామలై జిల్లాకు చెందిన గోవిందన్ పొన్ను స్వామి, కాగా ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 3 లక్షల జరిమానా




విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని కడప జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

# గ్యాస్ ధర పెంపుదలపై ధర్నా




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** వంట గ్యాస్ సిలిండర్‌కు రూ. 60లు, వాణిజ్య సిలిండర్కు రూ.115లు కేంద్ర ప్రభుత్వం పెంచడాని నిరసిస్తూ, గ్యాస్ ధరలు ఉపశంహరించు కోవాలని పెద్దాపురం రెవిన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట సిపిఎం పెద్దాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వ హించారు. సోమవారం చేపట్టిన ధర్నాలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ ఇరాన్ అమెరికా, ఇజ్రాయెల్ దాడి, రష్యా నుండి ఆయిల్ కొనుగోలుపై ఆంక్షలు నేపథ్యంలో ఈ ధరల పెంపుదల ప్రజలపై శరాఘాతంగా మారిం దన్నారు. ఈ యుద్ధాన్ని ఖండించి నిలుపుదల చేయించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని, ఆ భారాన్ని నేడు ప్రజలపై నెట్టడం ఘోరం అన్నారు. ఇప్పటికే నిత్యవసర సరుకుల ధరలు పెరిగి సతమతమవుతున్న సామాన్యులపై వంటగ్యాస్ ధర పెంపు పెద్ద దెబ్బ అని, ఉపాధి కోసం తోపుడు బళ్ళు, ఇతర చిన్న చిన్న వ్యాపారాలతో పొట్ట గడుపుకుంటున్న చిరు వ్యాపారులను వాణిజ్య సిలిండర్ ధర పెంపు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. అంతేకాక అసంఘటిత కార్మికులు స్వల్ప ఆదాయాలు కలిగినవారు కొనుక్కునే టిఫిన్, కర్రీ తదితర ఆహార ధరలు కూడా పెరుగుతాయని, అన్ని విధాల ప్రజా జీవితాన్ని ఘోరంగా నష్టపరిచే గ్యాస్ ధర పెంపును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వ మనుగడకు ఆక్సిజన్ సమకురుస్తున్న టిడిపి కూడా గ్యాస్ ధర పెంపుదలను ఉపశమహరించుకొనే విదంగా ఒత్తిడి చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, కూనిరెడ్డి అప్పన్న, గడిగట్ల సత్తిబాబు, రొంగల సుబ్బలక్ష్మి, యాసలపు రమేష్, చల్లా విశ్వనాధం, తెనాలా శ్రీను, రమణ, సిరిపురపు బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

# కళలకు ప్రఖ్యాతి పెద్దాపురం...బాడీ బిల్డింగ్ పోటీల్లో డిసిసిబి ఛైర్మన్

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణం అన్ని కళలకు ప్రఖ్యాతి అని జిల్లా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) తెలిపారు. పెద్దాపురం పట్నం దర్గా సెంటర్లో రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు పెద్దాపురం "టీ ఫిట్ జోన్" వ్యాయామ ఉపాధ్యాయులు యామాల మౌనేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 150 మంది రాష్ట్రస్థాయి నుండి బరిలోకి దిగారు. 9 క్యాటగిరిలో 18 నుండి 50 సంవత్సరాలు పైనున్న బాడీబిల్డర్లు పోటీ చేయగా మొదటి బహుమతి ఏలూరుకు చెందిన వ్యక్తికి లభించింది. రెండో బహుమతి వైజాగ్ చెందిన వ్యక్తి గెలుపొందారు. గెలుపొందిన విజేతలకు కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి చేతుల మీదుగా ట్రోఫీ, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి మాట్లాడుతూ పెద్దాపురం పట్టణంలో అనేకమంది క్రీడాకారులు, కళాకారులు జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో రాణించి పట్టణానికి పేరు ప్రఖ్యాతలు తీసుకు వచ్చారన్నారు. తద్వారా మన పట్టణానికి మన రాష్ట్రానికి గర్వించదగ్గ పేరు వచ్చిందన్నారు. కాగా పెద్దాపురంలో జరుగుతున్న బాడీ బిల్డింగ్ పోటీలు రాష్ట్రస్థాయిలో మన



పట్టణంలో మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేయడం ఎంతో అభినందనమని, ఇలాంటి పోటీలు వల్ల యువతలో చైతన్యం వచ్చి చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా తన ఆరోగ్యం పై దృష్టి పెడతారన్నారు. దేహ దారుఢ్య పోటీలో విజయం సాధిస్తే ఉన్నత స్థాయికి వెళ్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యామాల మౌనేంద్ర, పెద్దాపురం పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు, కౌన్సిలర్ ఓబుల శెట్టి గున్ని, ప్రముఖ సేవాపరుడు పణంగా పల్లి చలపతిరావు, జిగిని రాజేష్ కన్నా, మారిన చిన్న, వంగలపూడి సతీష్, కొల్లి దుర్గాప్రసాద్, కందుల వెంకటచలం, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు






**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** తిరుపతి జనసేన పార్టీ ఎమ్మెల్యే, తిరుపతి పార్లమెంట్ ఉద్యమ కోఆర్డినేటర్ ఆరణి శ్రీనివాసులు జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని సీఎం ఫంక్షన్ హాల్‌లో శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు వీర మహిళలతో ఉద్యమి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టేసాయి ప్రసాద్ మార్చి 8వ తేదీన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని ఎమ్మెల్యే చేతుల మీదగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి, సత్యవేడు జనసేన పార్టీ ఇంచార్జ్ లావణ్య కుమార్, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి జయప్రకాష్, జనసేన శ్రీకాళహస్తి పట్టణ నాయకులు గరికపాటి చంద్ర తదితర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాపర్ కేబుల్ దొంగల గ్యాంగ్ 7 మంది అరెస్ట్



**తిరుపతి, (రాజధాని వార్తలు):** పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యవసాయ బోరు మోటార్లకు అమర్చిన కాపర్ కేబుల్ వైర్లను దొంగతనం చేస్తున్న గ్యాంగ్‌ను పోలీసులు 7 మంది నిందితులను అదుపులోకి తీసుకుని సుమారు రూ.5.30 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు చంద్రగిరి ఎస్‌డిపిఓ బేతపూడి ప్రసాద్ సూచనలతో పాకాల పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ చిన్న గోవిందు ఆధ్వర్యంలో ప్రత్యేక గస్తీ నిర్వహించారు. ఈ క్రమంలో పాకాల ఎస్ఐ తరుణ్ తన సిబ్బందితో కలిసి మార్చి 8న పాకాల రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో వాహన తనిఖీలు చేపడుతుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఆటో వద్ద ఉన్న నలుగురు వ్యక్తులు పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా వెంటాడి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న సంచుల్లో కాపర్ కేబుల్ వైర్లు, దొంగతనాలకు ఉపయోగించే పనిముట్లు లభించాయి. విచారణలో తిరుపతి జిల్లాలోని పలు మండలాల్లో వ్యవసాయ బోరు మోటార్లకు అమర్చిన కాపర్ కేబుల్ వైర్లను కత్తిరించి దొంగతనం చేసినట్లు, అలాగే కొన్ని ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. దర్యాప్తులో భాగంగా మరికొంతమంది సహచరుల వివరాలు బయటపడటంతో మొత్తం 7 మందిని ఈ కేసులో అరెస్ట్ చేశారు. ఈ కేసును ఛేదించడంలో చురుకుగా పని చేసిన పాకాల ఇన్స్పెక్టర్ చిన్న గోవిందు, ఎస్ఐ తరుణ్ మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# వినోద, పర్యాటక రంగాల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ : మంత్రి కందుల దుర్గేష్

**ముంబయి/అమరావతి, (రాజధాని వార్తలు):** పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వ విధానాలు, మౌలిక సదుపాయాలు, సంస్కరణలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మహారాష్ట్రలోని ముంబయిలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతున్న 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆధునిక పర్యాటక రంగంలో అమ్యూజ్‌మెంట్, థీమ్ పార్కులు కీలకమైన స్తంభాలుగా ఎదిగిన నేపథ్యంలో కుటుంబాలు వినూత్న అనుభూతుల కోసం, యువత సాహస క్రీడల కోసం, సామాన్య పర్యాటకులు కొత్తదనం కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొంటూ అమ్యూజ్‌మెంట్ రంగంలోని జాతీయ, అంతర్జాతీయ ఇన్వెస్టర్లను ఉద్దేశించి ప్రసంగించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, వేలాది ఉద్యోగాలను సృష్టించడం తద్వారా సమాజ జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పర్యాటక రంగంలో ఇన్వెస్టర్లకు అందిస్తున్న రాయితీలను తెలుపుతూ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వివరించారు. మంత్రి దుర్గేష్ స్పీచ్‌పై ఇన్వెస్టర్లు హర్షం వ్యక్తం చేశారు. ముందుగా ఎక్స్‌పోను ప్రారంభించిన మంత్రి దుర్గేష్ స్టాళ్లను పరిశీలించి ఏపీ పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు.పలు స్టాళ్ల వద్దకు వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన వినోద సాధనాలను పరిశీలించారు. కార్యక్రమం అనంతరం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అంకూర్ మహేశ్వరితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా: సుదీర్ఘ తీరప్రాంతం, గొప్ప సాంస్కృతిక వారసత్వం, వైవిధ్యమైన ప్రకృతి దృశ్యాలు కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పర్యాటక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించిందని, నూతన పర్యాటక పాలసీ 2024-29 ద్వారా ఇన్వెస్టర్లకు 25 శాతం వరకు ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ, పారిశ్రామిక ధరలకే విద్యుత్ సరఫరా, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రీయింబర్స్‌మెంట్,100 శాతం నెట్ ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, ఉపాధి కల్పన ఆధారిత సబ్సిడీలు తదితర భారీ రాయితీలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

**దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక భూ కేటాయింపు విధానం:**

హోటళ్లు, థీమ్ పార్కులు, రిసార్టుల కోసం భూ కేటాయింపు ప్రక్రియను సరళతరం చేస్తూ 'టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 2025'ను దేశంలోనే మొదటిసారిగా ఏపీ ప్రభుత్వం





ప్రవేశపెట్టిందని మంత్రి దుర్గేష్ వివరించారు. రూ. 50 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టే ప్రాజెక్టులకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ద్వారా నేరుగా భూ కేటాయింపులు జరుగుతాయని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047:సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల దార్శనికతతో 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047'ని రూపొందించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. దీని ద్వారా ఏపీని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. గత ఏడాది కాలంలోనే 102 ఒప్పందాల ద్వారా రూ. 18,448 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని ఆయన వెల్లడించారు. అదనంగా, స్టేట్ ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ బోర్డు ద్వారా రూ. 9,446 కోట్ల పెట్టుబడితో 7,348 క్లాసిఫైడ్ హోటల్ గదుల నిర్మాణానికి ఆమోదం తెలిపామన్నారు. పర్యాటక రాయితీలను పొందడంలో పారదర్శకత, వేగం, ఎటువంటి ఇబ్బందులు లేని ప్రక్రియను నిర్ధారించడానికి పర్యాటక విధానానికి సంబంధించిన 'ఆపరేషనల్ గైడ్‌లైన్స్' విడుదల చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో పర్యాటక అనుభవాలను విస్తృతం చేయడానికి కారవాన్ టూరిజం ప్రమోషన్, హోమ్‌స్టే, బి అండ్ బి పాలసీ 2025లను తెచ్చామన్నారు. త్వరలోనే కాన్సర్ట్ పాలసీ, ఏపీ ఫిల్మ్ టూరిజం పాలసీ, మైస్ పాలసీలను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ఇవి పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించడమే కాకుండా స్థానికులకు ఉపాధిని కల్పిస్తున్నాయన్నారు.

**మెగా పెట్టుబడులకు మూడు ప్రధాన నగరాలు..ఆంధ్రప్రదేశ్ - అవకాశాల గని:**

అంతర్జాతీయ స్థాయి థీమ్ పార్కులు, వాటర్ ఫ్రంట్ అట్రాక్షన్స్, అడ్వెంచర్ జోన్లు, సమగ్ర వినోద కేంద్రాల ఏర్పాటుకు ఏపీలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, తీరప్రాంత సర్క్యూట్లు, ఆధ్యాత్మిక పట్టణాలు, అటవీ ప్రాంతాలు, పట్టణ వినోద కారిడార్లలో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. వాటర్ రిక్రియేషన్, ఫిల్మ్ థీమ్ పార్కులు, అడ్వెంచర్ స్పోర్ట్స్ హబ్‌లకు ఇక్కడ అధిక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో అమ్యూజ్‌మెంట్, థీమ్ పార్కుల కోసం మూడు కీలక నగరాలను ప్రతిపాదించారు. గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతి నూతన ఆవిష్కరణలకు అద్భుతమైన వేదిక అని, విశాఖపట్నంను అంతర్జాతీయ స్థాయి తీరప్రాంత పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని, భారీ సంఖ్యలో వచ్చే భక్తుల దృష్ట్యా ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తిరుపతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన పర్యాటక, పట్టణ అభివృద్ధి ప్రాజెక్టులతో సమానంగా ఈ రంగానికి కూడా ప్రాముఖ్యతనిస్తూ ఒక అనుకూలమైన వ్యవస్థను నిర్మిస్తున్నామని భరోసానిచ్చారు. అంతర్జాతీయ స్థాయి వినోద కేంద్రాల నిర్మాణంలో ఇన్వెస్టర్లకు ఎదురయ్యే అడ్డంకులను తొలగించి, అనుమతుల ప్రక్రియను సులభతరం చేస్తున్నామని వివరించారు.

**టైర్-2, టైర్-3 నగరాల్లో చిన్న తరహా పార్కులు:**

రాష్ట్రంలోని చిన్న నగరాల్లో కూడా వినోద అవసరాలు పెరుగుతున్నాయని, అక్కడ చిన్న తరహా అమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో త్వరితగతిన రాబడిపొందవచ్చని ఇన్వెస్టర్లకు మంత్రి దుర్గేష్ సూచించారు.

**మౌలిక వసతులు మరియు భరోసా:**

ఏపీలో విమానాశ్రయాల విస్తరణ, మెరుగైన రవాణా సౌకర్యాలు, సుదీర్ఘ తీరప్రాంతం, బలమైన హాస్పిటాలిటీ నెట్ వర్క్ పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని మంత్రి దుర్గేష్ తెలిపారు. "ఏపీ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టండి.. మీకు పూర్తి భరోసా కల్పించే బాధ్యత మా కూటమి ప్రభుత్వానిది" అని ఆయన ముంబయి వేదికగా ఇన్వెస్టర్లకు పిలుపునిచ్చారు.

**ఆంధ్రప్రదేశ్ కేవలం పర్యాటక ప్రదేశమే కాదు.. పెట్టుబడిదారుల కలల రాష్ట్రం:**

భారతదేశంలో వినోద రంగాన్ని అభివృద్ధి చేయడానికి అనువైన వాతావరణాన్ని సృష్టించడం ఐఏఏపీఐ ప్రధాన లక్ష్యమని మంత్రి దుర్గేష్ అన్నారు. వీరితో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా భారతదేశంలోని అమ్యూజ్‌మెంట్ పార్కులు, థీమ్ పార్కులు, వాటర్ పార్కులు, ఇండోర్ అమ్యూజ్‌మెంట్ సెంటర్ల ప్రయోజనాలకు, భద్రతా ప్రమాణాలు, వృత్తిపరమైన శిక్షణ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులు, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ప్రాతినిధ్యం వహించే ఒక అగ్రగామి సంస్థగా కొనియాడారు. IAAPI వంటి అనుభవజ్ఞులైన సంస్థల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రపంచ స్థాయి థీమ్ పార్కులను ఏర్పాటు చేసి, పర్యాటకులకు మర్చిపోలేని అనుభూతులను అందించాలని కోరుకుంటున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ కేవలం పర్యాటక ప్రదేశమే కాదు.. పెట్టుబడిదారుల కలల రాష్ట్రమని, అమ్యూజ్‌మెంట్ పరిశ్రమ ద్వారా రాష్ట్రానికి కొత్త శోభను, యువతకు ఉపాధిని తీసుకురావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయమన్నారు. మాకు కేంద్ర సహకారం మెండుగా ఉందని తెలిపారు. సృజనాత్మకతకు, ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనమైన ఐఏఏపీఐ ఎక్స్‌పోలో పాల్గొనడం సంతోషంగా ఉందన్న మంత్రి దుర్గేష్ వినోద రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళుతున్న ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఏపీలో వేల సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు, పర్యాటక భవిష్యత్తు నిర్మాణానికి భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వ ప్రధాన దృష్టి ఆధునికమైన, సుస్థిరమైన,సురక్షితమైన గమ్యస్థానాలను నిర్మించడంపై ఉందని, వినూత్న ఆలోచనలు, అత్యాధునిక సాంకేతికతతో వచ్చే భాగస్వామ్యాలను ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ ఆహ్వానిస్తుందన్నారు. అదేవిధంగా మెగా పార్కుల నుండి చిన్న తరహా పార్కుల వరకు అపారమైన సామర్థ్యాన్ని వెలికి తీయడానికి పరిశ్రమల అధిపతులు, డెవలపర్లు, పారిశ్రామికవేత్తలతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అందిస్తున్న అద్భుత అవకాశాలను పరిశీలించాలని, తమతో భాగస్వాములు కావాలని సాదరంగా ఆహ్వానిస్తూ రండి, రేపటి సంతోషాన్ని నేడే కలిసి నిర్మిద్దామని ప్రసంగాన్ని ముగించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అంకూర్ మహేశ్వరి మాట్లాడుతూ భారతదేశంలో అమ్యూజ్‌మెంట్ రంగం ఏటా 15 శాతం వృద్ధిని నమోదు చేస్తోందని, 2030 నాటికి ఈ రంగం రూ.25,000 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నామన్నారు. ప్రస్తుతం భారత దేశంలో సుమారు 300 అమ్యూజ్‌మెంట్ పార్కులు, 2,500 ఇండోర్ సెంటర్లు ఉండటం ఈ రంగంపై ప్రజలకు ఉన్న ఆసక్తిని తెలియజేస్తోందని వివరించారు.

ఏపీ పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ఈ ఎక్స్ పోను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఏపీలో ఈ రంగంలో విస్తృత పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, మార్కెటింగ్ మేనేజర్ రఫీక్, సీనియర్ కన్సల్టెంట్లు సత్యప్రభ, శివ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan